www.visalaandhra.com
స్థాపితం : 1952
శనివారం
20-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 360
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏఐతో అస్త్రాల తయారీపై కిమ్ దృష్టి

ప్యాంగ్యాంగ్: అత్యాధునిక ఆయుధాల అభివృద్ధి పనులను ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ పరిశీలించారు. రాజధాని ప్యాంగ్యాంగ్‌లోని అన్‌మ్యాన్డ్ ఏరోనాటికల్ టెక్నాలజీ కాంప్లెక్స్‌ను సందర్శించారు. మల్టీపర్పస్ డ్రోన్స్, మానవరహిత నిఘా విమానాల పరీక్షలపై ఆరా తీశారు. కృత్రిమ మేధ (ఏఐ)ను వేగంగా అందిపుచ్చుకోవాలని, అస్త్రాల తయారీకి ఆ సాంకేతికతను వాడాలన్నారు. మానవ రహిత ఆయుధ వ్యవస్థలను పెంచడానికి ఇది కీలకమని కిమ్ సూచించారు. ఘన ఇంధన రాకెట్ పరీక్షలను ఇటీవల పర్యవేక్షించారు. అణుశక్తి విస్తరణపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించారు. ఇటీవల నిఘా ఉపగ్రహాల తయారీకి కిమ్ పూనుకున్నారు.

ఈడీ దూకుడు

మద్యం కుంభకోణంపై విస్తృత తనిఖీలు

- రెండోరోజూ దేశవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో సోదాలు
- రూ.175 కోట్ల బంగారు నాణేల కొనుగోలుపైనా ఆరా
- కీలక దస్త్రాలు, లెక్కల్లో చూపని రూ.38లక్షల నగదు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ రెండోరోజు కూడా దేశవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. ఈకేసులో నిందితులకు సంబంధించిన సంస్థలు, కార్యాలయాలపై హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తంజావూరు, సూరత్, రాయ్‌పూర్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రభుత్వ ఖజానాకు రూ.4000 కోట్ల నష్టం వాటిల్లిందని సీఐడీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. సోదాల్లో కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాలు

- మిగతా 2 లో

22 నుంచి దసరా సెలవులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు ఈనెల 22 నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముందు ప్రకటించిన సెలవుల తేదీలలో కొన్ని మార్పులు చేసినట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం వెల్లడించారు. తొలుత ఈనెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ఇవ్వాల్సి ఉంది. తాజాగా 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దీంతో దసరా సెలవులు అదనంగా రెండు రోజులు పెరిగాయి. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం తొమ్మిది రోజులే

- మిగతా 2 లో

ఓబుళాపురం మైనింగ్ అక్రమాలపై కమిటీ

విశ్రాంత న్యాయమూర్తి సుధాంశు ధులియా నేతృత్వం

- మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలి
- సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: ఓబుళాపురం మైనింగ్ అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓబుళాపురం గనుల లీజు సరిహద్దులు గుర్తించి... ఎంతమేర ఇనుప ఖనిజం అక్రమ తవ్వకాలు చేశారో తేల్చేందుకు విశ్రాంత న్యాయమూర్తి సుధాంశు ధులియా నేతృత్వంలో సుప్రీంకోర్టు కమిటీ ఏర్పాటు చేసింది. గతంలో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం... ఏడుగురితో కమిటీని నియమించింది. కమిటీ సభ్యులుగా కేంద్ర పర్యావరణ సాధికార కమిటీ నుంచి ఒకరు, కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి ఇద్దరు, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి ముగ్గురు ఉంటారని సుప్రీంకోర్టు తెలిపింది. మూడు నెలల్లో నివేదిక అందించాలని నిర్దేశించింది. తదుపరి విచారణను 2026 జనవరికి వాయిదా వేసింది. గాలి జనార్దనరెడ్డి సోదరులకు అనుకూలంగా వైసీపీ హయాంలో ఇచ్చిన అఫిడవిట్‌ను ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. గాలి బ్రదర్స్ మైనింగ్ చేసుకోవడానికి అనుమతించవచ్చంటూ 2022లో వైసీపీ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సరిహద్దు వివాదం ముగిసిందని, మైనింగ్ కొనసాగించడానికి గాలి బ్రదర్స్‌కు అనుమతి ఇవ్వాలని వైసీపీ సర్కార్ అఫిడవిట్‌లో పేర్కొంది. దాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అమెకస్ క్యూరీ అఫిడవిట్ దాఖలు చేశారు. అమెకస్ క్యూరీ నివేదికను పరిగణనలోకి తీసుకొని వైసీపీ

- మిగతా 2 లో

రాజ్యాంగ పీఠిక చూడండి

బాను ముస్తాఖ్ వ్యవహారంలో సుప్రీం వ్యాఖ్య

దసరా ఉత్సవాలకు ఆహ్వానంపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: మైసూరు దసరా ఉత్సవాలకు బుకర్ పురస్కార గ్రహీత బాను ముస్తాఖ్‌ను కర్నాటక ప్రభుత్వం ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఒకసారి రాజ్యాంగ పీఠిక చూడండి అంటూ పిటిషనర్‌కు సూచించింది. కేవలం ముస్లిం అన్న కారణంతో దసరా ఉత్సవాలకు ఆమెను ఆహ్వానించడాన్ని తప్పుపట్టడాన్ని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఖండించింది. లౌకికవాదం, స్వేచ్ఛ, మత

- మిగతా 2 లో

సర్వతోముఖాభివృద్ధి లక్ష్యం

- రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానం-భరోసా
- భావి తరాలకు అవకాశాల సృష్టిపైనే దృష్టి
- డిసెంబరులో 'తెలంగాణ విజన్' విడుదల
- ప్రజా వ్యవహారాల ఫోరం వార్షిక సదస్సులో రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: పరిపాలనకు రాజకీయ సంకల్పం అవసరమని, భవిష్యత్ తరాలకు అవకాశాలు సృష్టించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తమది కొత్త రాష్ట్రమే అయినా హైదరాబాద్‌కు ఘన చరిత్ర ఉందన్నారు. ప్రజా వ్యవహారాల ఫోరం 12వ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్–2047 రూపొందిందని, డిసెంబరు 9న విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామన్నారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించామని, కోర్ అర్బన్ పరిధిలో కోటి మంది ఉన్నారని, ఇక్కడ కాలుష్య కారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నామని రేవంత్ చెప్పారు. సెమీ అర్బన్ ప్రాంతాన్ని తయారీ రంగం జోన్‌గా నిర్ణయించామన్నారు. రాష్ట్రాభివృద్ధికి తగినట్లు 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లు పొడిగించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఐదు లక్షల మంది మెట్రోలో పయనిస్తుండగా, వారి సంఖ్యను 15 లక్షలకు పెంచాలని లక్ష్యం పెట్టుకున్నామని సీఎం చెప్పారు. సబర్మతీ తీరంలా మూసీని మారుస్తామన్నారు. మూసీ పునరుజ్జీవంపై దృష్టి సారించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా వాడేలా ఈవీలకు రాయితీలు ప్రకటించామని తెలిపారు. రాష్ట్ర అవసరాలకు తగినట్లు రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) నిర్మించామని రేవంత్ చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ అనుసంధానత కల్పిస్తామన్నారు. తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని, వాటికి భరోసా ఇస్తున్నామన్నారు. పెట్టుబడులు పెట్టి

- మిగతా 2 లో

ఉమర్ బెయిల్‌పై విచారణ మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీ అల్లర్ల కేసులో జేఎన్‌యూ మాజీ స్కాలర్ ఉమర్ ఖాలిద్, సామాజిక కార్యకర్త షర్జీల్ ఇమామ్ బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం వాయిదా వేసింది. టువంటి కారణం చెప్పకుండానే ఈ పిటిషన్‌లపై విచారణను సోమవారం (22వ తేదీ) చేపడతామని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇమామ్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ హాజరయ్యారు. ఈనెల 2న బెయిల్ నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పిటిషన్‌దారులు సుప్రీంకోర్టును

- మిగతా 2 లో

మరో 474 పార్టీలపై ఈసీ వేటు

న్యూఢిల్లీ: గత ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలతో పాటు నిబంధనలను ఉల్లంఘించిన పార్టీలను ఎన్నికల సంఘం డీ–లిస్ట్ చేసింది. మొత్తం 474 రాజకీయ పార్టీలను తొలగించింది. రిజిస్టర్డ్ అన్ రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్‌పై వేటు ప్రక్రియ తొలిదశలో భాగంగా ఆగస్టు 9న 334 పార్టీలు డీ లిస్ట్ అయ్యాయి. రెండవ దశలో 474 పార్టీలను ఈసీ తొలగించింది. దీంతో రెండు నెలల్లో మొత్తం 808 ఆర్ యూ పీపీలు డీ లిస్ట్ అయినట్లు ప్రకటన పేర్కొంది. ఇటీవల వరకు 2,520 ఆర్‌యూపీపీలు ఉండగా, డీ లిస్టింగ్ తర్వాత 2,046 మిగి లాయి. దేశంలో ఆరు గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయి.

అవినీతిని ఉపేక్షించం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- అక్రమాలకు పాల్పడిన నలుగురు అధికారుల సస్పెన్షన్
- ఇందిరమ్మ కమిటీ సభ్యుడి తొలగింపు: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర – హైదరాబాద్: పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. లబ్ధిదారుల సమస్యలు, సందేహాల నివృత్తి కోసం గత వారం హౌసింగ్ కార్పొరేషన్‌లో ప్రారంభించిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై ... అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి .గౌతమ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెస్ ఏడీజీ సంగ్రామ్ సింగ్ పాటిల్‌తో కలిసి మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి లంచం అడిగే కమిటీ సభ్యులను తక్షణం తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా మధిరాల

- మిగతా 2 లో

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు

- టెండర్ల ప్రక్రియ వేగవంతం
- సబ్ కమిటీ సమావేశంలో భట్టి

విశాలాంధ్ర – హైదరాబాద్: అభివృద్ధి పనులను శాఖల వారీగా ప్రాధాన్యతాక్రమంలో విభజించి ప్రతిపాదనలు తీసుకు రావాలని డిప్యూటీ సీఎం, సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క సూచించారు. అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్... క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు... సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... 1:3 శాతం చొప్పున ప్రతిపాదనలు తీసుకురావాలని, ప్రతిపాదనల సంఖ్య ఎక్కువగా

- మిగతా 2 లో

30లోపు స్థానిక ఎన్నికలు జరపలేం

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్‌దే నిర్ణయం: సీఎం రేవంత్

2 లో

ఓట్ల దొంగలకు రక్షణ... 'ఎన్నికల కాపలాదారు'

జ్ఞానేశ్‌కుమార్‌పై రాహుల్ ప్రత్యక్ష దాడి

యువత, విద్యార్థులే ఓట్ల చోరీని ఆపగలరని వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్రనేత, లోకసభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోమారు ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్, సీఈసీలపై గురువారం నాటి తన ఆరోపణలకు కొనసాగింపుగా శుక్రవారం ఉదయం రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఓట్ చోరీ విషయంలో తన ఆరోపణలకు 100 శాతం పక్కా ఆధారాలున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌ను 'ఎన్నికల కాపలాదారు' అని అభివర్ణించారు. అతను మేల్కొని దొంగతనాన్ని చూస్తూ... దొంగలను రక్షించాడంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఉదయం 4 గంటలకు నిద్రలేవండి.

36 సెకన్లలో ఇద్దరు ఓటర్లను తొలగించండి... ఆపై తిరిగి నిద్రపోండి – ఓటు దొంగతనం ఇలా జరుగుతుంది' అని వెల్లడించారు. "చునావ్ కా చౌకిదర్ జాగ్తా రహా, చోరీ దేఖ్తా రహా, చోరోంకో బచాటా రహా (ఎన్నికల

- మిగతా 2 లో

ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

పాదయాత్రలో కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం: మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో, రవాణారంగ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆటోవాలాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. దీనికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య నేతృత్వంతో ఆటో కార్మికులు చేపట్టిన పాదయాత్రకు కూనంనేని సంఘీభావం తెలిపి మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం స్వాగతించాల్సిందేనన్నారు. కానీ ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆటోల కొనుగోలుకు సబ్సిడీ రుణాలను అందించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరస్వామి, వాసిరెడ్డి మురళి, వేల్పుల మల్లికార్జున్, ఆటో యూనియన్ నేతలు బత్తుల సత్యనారాయణ, మర్రి కృష్ణ, ఆరేల్లి కృష్ణ, అబ్బులు, భాష, చింటూ, ముక్కెర లక్ష్మణ్, జోసఫ్, అమిత్, మాజీ కౌన్సిలర్స్ ధర్మరాజు, ఈసుబు, బోయిన విజయకుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు...

పేద, దిగువ మధ్యతరగతి పిల్లలు అధిక శాతం విద్యనభ్యసించే ప్రభుత్వ విద్యాలయాల్లో సౌకర్యాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని కూనంనేని అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.3.92 కోట్ల టీజీబీఐ నిధులతో నిర్మించనున్న నూతన భవనాల సముదాయానికి శంకుస్థాపన చేయగా, రూ.58 లక్షల వ్యయంతో చేపట్టనునన్న మరమ్మత్తు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్, ప్రైవేట్‌కు ధీటుగా విద్యనందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. విద్యారంగానికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని

- మిగతా 2 లో

పత్తి రైతులకు ప్రభుత్వ అండ

- మద్దతు ధరకు సీసీఐతో సమన్వయం
- అక్టోబరు నుంచే కొనుగోళ్లకు ఏర్పాట్లు
- అందుబాటులో జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లులు, గోదాములు
- సమీక్షలో మంత్రి తుమ్మల

2లో

'ఆల్మట్టి' ఎత్తు పెంపు రైతాంగానికి మరణ శాసనం

కర్నాటక కుట్ర అడ్డుకోకుంటే మహోద్యమం

2లో

'కాళేశ్వరం'పై కాంగ్రెస్ అసత్య ప్రచారం: కేటీఆర్

ఇదీ లోకం!

ఊరేగింపు కాదు, వీళ్లంతా మీవల్ల కేసుల్లో చిక్కుకున్న మన నాయకులు అధికారులు.

'బగ్రామ్'పై నిర్ణయం అఫ్గాన్‌దే: చైనా

బీజింగ్: అఫ్గాన్‌లోని బగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి తమ అధీనంలోకి తీసుకోవాలని అమెరికా నిర్ణయించడాన్ని చైనా ఖండించింది. దానిపై నిర్ణయాన్ని అఫ్గానిస్థాన్‌కు వదిలేయాలని సూచించింది. అఫ్ఘానిస్థాన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని చైనా గౌరవిస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ వెల్లడించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అఫ్ఘానిస్థాన్ భవిష్యత్తుపై నిర్ణయాధికారం ఆ దేశానిది, అక్కడి ప్రజలది. ప్రాదేశిక ఘర్షణలకు ఆజ్యం పోస్తే మద్దతు లభించదు. ప్రాదేశిక సుస్థిరత కోసం సంబంధిత వర్గాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని ఆశిస్తున్నాం' అని లిన్ అన్నారు. బగ్రామ్ ఎయిర్ ఫోర్స్ బేస్‌ను చైనా అధీనంలోకి తీసుకొని భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌ను వాడుకోవాలని భావిస్తుందని అమెరికా చెబుతోంది. అందుకోసమే ఆ స్థావరాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇదే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా వెల్లడించారు. నాలుగేళ్ల కిందట వదిలేసిన ఈ స్థావరాన్ని మళ్లీ స్వాధీనం చేసుకోవాలని, చైనాకు దగ్గరగా ఉంది కాబట్టి అక్కడ అమెరికా సైన్యం ఉండటానికి ప్రాధాన్యత ఉంటుంది అని ఆయన చెప్పారు.

పుతిన్ నిరాశపరిచారు

రష్యాపై ఆంక్షలకు బ్రిటన్ అంగీకారం

చమురు కొనుగోళ్లు ఆగితేనే యుద్ధానికి తెర: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనను నిరాశపరిచారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. 'ఆయన నన్ను బాగా నిరాశపరిచారు. అనేక మందిని చంపుతున్నారు. అంతకంటే ఎక్కువగా సొంత వాళ్లనూ కోల్పోతున్నారు. ఉక్రెయిన్‌తో పోల్చుకుంటే రష్యా సైనికులే అధికంగా మరణిస్తున్నారు' అని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆపడం అనుకున్నంత సులువు కాదని ట్రంప్ అంగీకరించారు. అయితే అధ్యక్షుడి స్థానంలో తాను ఉంటే యుద్ధం మొదలయ్యేదే కాదని మళ్లీ చెప్పుకున్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే దిశగా రష్యాపై ఆంక్షలు విధించేందుకు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అంగీకరించారని ట్రంప్ వెల్లడించారు. భారత్ మిత్రదేశమని, ప్రధాని మోదీ మిత్రుడన్నారు. 'భారత్‌తో మోదీతో మంచి సంబంధాలు ఉన్నాయి కానీ నేను ఆంక్షలు విధించాను' అని తెలిపారు. ట్రంప్ తన బ్రిటన్ పర్యటనను ముగించుకొని అమెరికాకు తిరిగి వెళ్లే క్రమంలో ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'ఈయూ, నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం గురించి ప్రస్తావించినప్పుడు స్టార్మర్ కాస్త ఇబ్బందిపడ్డారు. కానీ నాతో ఏకీభవించారు. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేయడంతో సహా ఆ దేశంపై ఆంక్షలు విధించేందుకు అంగీకరించారు' అని వెల్లడించారు. ఉక్రెయిన్‌లో శాంతికి చమురు కొనుగోళ్లు నిలిపివేయడమే సరైన చర్యగా ట్రంప్ తెలిపారు. అలా జరిగితేనే పుతిన్ దిగివస్తారని, యుద్ధం ఆపేందుకు అంగీకరిస్తారని అన్నారు. అక్రమ వలసలపై స్టార్మర్‌తో

చర్చించినట్లు తెలిపారు. వలసలను అరికట్టేందుకు సైన్యాన్ని రంగంలోకి దించాలని సూచించినట్లు ట్రంప్ వెల్లడించారు. అదే సమయంలో లండన్ మేయర్ సాధిక్ ఖాన్ ప్రపంచంలోనే చెత్త మేయర్ అని విమర్శించారు. నేరాలు, వలసల నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. బ్రిటన్ విందుకు సాధిక్ ఖాన్ గైర్హాజరిపై విలేకరి ప్రశ్నించగా 'లండన్ మేయర్‌ను ఆహ్వానించలేదు. ఆయనను రావద్దని చెప్పా, ఆయన రాకూడదనే అనుకున్నా' అని ట్రంప్ సమాధానం ఇచ్చారు. ఇదిలావుంటే నాలుగేళ్ల కిందట వదిలేసిన అఫ్ఘాన్‌లోని వైమానిక స్థావరాన్ని మళ్లీ స్వాధీనం చేసుకోవాలని, చైనాకు సమీపంలో అది ఉండటంతో అక్కడ అమెరికా సైన్యాన్ని మోహరించడం ముఖ్యమని ఆయనన్నారు.

శాంతి చర్చల ఉద్దేశం పుతిన్‌కు లేదు

బ్రిటన్ నిఘా వ్యవస్థ అధినేత మూరే

ఇస్తాంబుల్: ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు జరిపే ఉద్దేశం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు లేదని బ్రిటన్ విదేశీ గోప్య నిఘా వ్యవస్థ అధినేత రిచర్డ్ మూరే వెల్లడించారు. శాంతి చర్చలకు రష్యా సిద్ధమన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఎలాగైనా అనుకున్నది సాధించాలని పుతిన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు కానీ ఆయన ప్రయత్నం ఫలించదని చెప్పారు. పుతిన్‌తో పాటు చాలా మంది ఉక్రెయిన్‌ను తక్కువగా అంచనా వేశారని, ఆ దేశంపై సులువుగా గెలవగలమని రష్యా అనుకుందని మూరే అన్నారు. ఆయన శుక్రవారం ఇస్తాంబుల్‌లోని బ్రిటిష్ కాన్సులేట్‌లో మాట్లాడారు. ఈనెలాఖరుకు పదవీ విరమణ పొందనున్న ఆయన ఐదేళ్ల తర్వాత బ్రిటన్ నిఘా వ్యవస్థ అధినేత స్థానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూరే పదవీ విమరణ అనంతరం ఆ స్థానాన్ని మొదటిసారిగా మహిళా చీఫ్‌తో భర్తీ చేయనున్నారు. రష్యా సైనిక చర్యలతో ఉక్రెయిన్ దేశానికి మంచి గుర్తింపు వచ్చిందని, పశ్చిమ దేశాలతో సంబంధాలు బలపర్చుకోగలిగిందని అన్నారు. ఈ పరిణామాలే నాటోలో చేరేలా స్వీడెన్, ఫిన్లాండ్‌ను ప్రభావితం చేసినట్లు మూరే తెలిపారు. రష్యా గెలుపును కాదనలేరనే భావనను ప్రపంచానికి కల్పించాలని పుతిన్ అనుకున్నాగానీ ఆయన చెప్పే అబద్ధాలు ఎవరూ నమ్మరన్నారు.

ఓట్ల దొంగలకు రక్షణ... 'ఎన్నికల కాపలాదారు'

(మొదటిపేజీ తరువాయి)

కాపలాదారుడు మేల్కొని, దొంగతనాన్ని చూశాడు. దొంగలను రక్షించాడు)' అని రాహుల్ ఆరోపించారు. గురువారం మీడియా సమావేశంలో ఓట్ల చోరీపై తాను వెల్లడించిన అంశాలకు సంబంధించిన 36 సెకన్ల వీడియోను రాహుల్ పంచుకున్నారు. దీనిలో 2022 డిసెంబర్ 19న ఉదయం 4 గంటలకు ఎవరో ఒకరు కేవలం 36 సెకన్లలో రెండు పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఫారంలు తెరచి, పూర్తి చేసి, సమర్పించిన విధానాన్ని రాహుల్ గాంధీ వీడియోలో వివరించారు. గురువారం సాయంత్రం ఒక పోస్ట్‌లో... 'దేశంలోని యువత, విద్యార్థులు (జన్ జెడ్) రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతారు. ఓటు దొంగతనాన్ని ఆపేస్తారు. నేను ఎల్లప్పుడూ వారితో నిలబడతాను. జై హింద్' అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గురువారం మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటకలోని అలంద్ నియోజకవర్గంలో 6,018 ఓట్లను తొలగించారని, మహారాష్ట్రలోని రాజౌరా నియోజకవర్గంలో ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి 6,850 ఓట్లను మోసపూరిత పద్ధతిలో చేర్చారన్నారు. అదే వ్యవస్థ హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లో కూడా ఓట్లు తొలగిస్తోందని, దానికి సాక్ష్యాలు ఉన్నాయని అన్నారు. మీరు ఎన్నికల అధికారిగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని ప్రమాణం చేశారని, మీ విధులు సక్రమంగా నిర్వహించాలని భారతదేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సూచించారు. సాకులు వెతుకుతూ, తప్పించుకు తిరగడం ఆపాలని, కర్నాటక సీఐడీకి వెంటనే ఆధారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఓబుళాపురం మైనింగ్ అక్రమాలపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, గుంటూరు ప్రమోద్ కుమార్ తెలిపారు. ఏపీ, కర్నాటక సరిహద్దుల మధ్య వివాదాన్ని తనకు అనుకూలంగా మలుచుకొని అక్రమంగా వేలాది టన్నుల ఇనుప ఖనిజాన్ని తవ్వి గాలి బ్రదర్స్ ఎగుమతి చేశారు. ఈ క్రమంలో గాలి బ్రదర్స్‌కు వ్యతిరేకంగా గతంలో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై 15 ఏళ్లుగా సుప్రీంలో విచారణ కొనసాగుతోంది.

ఉమర్ బెయిల్‌పై విచారణ మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఉమర్ ఖాలిద్, ఇమామ్‌తో పాటు గుల్ఫిషా ఫాతిమా, ఖాలిద్ సైఫీ, అథర్ ఖాన్, మహమ్మద్ సలీమ్ ఖాన్, షిఫా-ఉర్- రెహ్మాన్, మీరాన్ హైదర్, షాదాబ్ అహ్మద్‌కు హైకోర్టు బెయిల్ నిరాకరించింది. తస్లీమ్ అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను కూడా ప్రత్యేక ధర్మాసనం తోసిపుచ్చింది.

22 నుంచి దసరా సెలవులు

(మొదటిపేజీ తరువాయి)

సెలవులు రాగా... తాజా మార్పుతో వాటి సంఖ్య 12 రోజులకు పెరిగింది. 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరడంతో విద్యాశాఖ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

అక్టోబర్ 3వ తేదీన మళ్లీ పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. జూనియర్ కళాశాలలకు ఈనెల 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు సెలవులు ఇచ్చిన విషయం విదితమే. ఈ తేదీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు మాత్రం ఈనెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తాజా నిర్ణయంతో సాధారణ పాఠశాలలకు 9 రోజుల నుంచి 12 రోజులపాటు దసరా సెలవులు లభిస్తాయి.

రాజ్యాంగ పీఠిక చూడండి

(మొదటిపేజీ తరువాయి)

సమానత్వం, సౌభ్రాతృత్వం జాతీయ ఐక్యతకు కీలకమని, ఇదంతా పీఠికలో ఉందని తెలిపింది. 'మీరు భారత రాజ్యాంగం పీఠిక ఎప్పుడైనా చదివారా? అందులో ఏముంది' అంటూ పిటిషనర్, బెంగళూరువాసి హెచ్‌ఎస్ గౌరవ్ తరపు సీనియర్ న్యాయవాది పీబీ సురేశ్‌ను జస్టిస్ నాథ్ ప్రశ్నించారు. న్యాయవాది సురేశ్ స్పందిస్తూ ఈనెల 22న దసరా ఉత్సవాల ప్రారంభోత్సవంలో రెండు ప్రధాన కార్యక్రమాలు ఉంటాయని, ఒకటి రిబ్బన్ కట్టింగ్ అని, అది లౌకిక కార్యక్రమమే కాగా తదుపరి హిందూ మత సంప్రదాయాల ప్రకారం పూజ ఉంటుందని, అది ఆధ్యాత్మిక కార్యక్రమమని తెలిపారు. చాముండేశ్వరి అమ్మవారి ఎదుట దీపం వెలిగించి, పూలు, పండ్లు, పసుపు, కుంకమలు సమర్పించాలి,

ఆచారం ప్రకారం మరికొన్ని పనులు చేయాల్సి వస్తుందని అన్నారు. బాను ముస్తాఖ్‌ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం కేవలం రాజకీయ చర్య అని, మతపరమైన కార్యక్రమానికి హిందూయేతరులను ఎందుకు ఆహ్వానించాలంటూ వాదించారు. బాను ముస్తాఖ్‌కు ఆహ్వానాన్ని రద్దు చేసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వాదనను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌ను కొట్టివేసింది.

30లోపు స్థానిక ఎన్నికలు జరపలేం

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్‌దే నిర్ణయం: సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు ఈ నెల 30వ తేదీ లోపు జరపడం కష్టమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే గడువు అంశం సుప్రీంకోర్టులో ఉంది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం ఏం చెబుతుందో వేచి చూస్తున్నాం. న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మళ్లీ కోర్టుకు వెళ్లాలా వద్దా అనేది అప్పుడే నిర్ణయం తీసుకుంటాం' అని సీఎం తెలిపారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పందిస్తూ... కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. బీఆర్‌ఎస్ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల జీతాల నుంచి రూ.ఐదువేలు ఆ పార్టీకే వెళ్తుందని అన్నారు. నిధులు సైతం బీఆర్‌ఎస్‌కే వెళ్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ తమకు 37 మంది ఎమ్మెల్యేల బలం ఉందని, సమయం కేటాయించాలని కోరారని గుర్తుచేశారు.

కవిత వ్యవహారం... కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమే

కవిత వ్యవహారం అంతా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమేనని సీఎం వ్యాఖ్యానించారు. 'ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి దాడి చేస్తున్నారు. కుటుంబ వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధం... కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు సామాజికంగా బహిష్కరించారు. 2014-19 మధ్య కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మహిళ కూడా లేరు. ఉద్యమం పేరుతో ఆయన కొన్ని వందల మంది పిల్లల ఉసురు పోసుకున్నారు. అది ఊరికే పోదు. హైదరాబాద్ మెట్రో విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్ కలిసి అడ్డంకులు సృష్టిస్తున్నారు. 'ఎల్ అండ్ టీ'తో ఒప్పందం చేసుకుంటేనే అనుమతులు ఇస్తామని కేంద్రం చెబుతోంది. కేంద్రంలో ఉన్న కిషన్‌రెడ్డి ఇలాంటి మెలికలు పెడుతున్నారు. కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పదే పదే డిమాండ్ చేశారు. అలా చేస్తే... 48 గంటల్లోనే ఈ కేసు విచారణ చేపట్టేలా చూస్తానని అన్నారు. సీబీఐకి ఇచ్చి ఇన్ని రోజులైంది.. కిషన్‌రెడ్డి ఎక్కడా మాట్లాడటం లేదు. సీబీఐ దర్యాప్తును ఆపాలని కేటీఆర్ చెప్పారు కాబట్టే కిషన్‌రెడ్డి అమలు చేశారు. కేటీఆర్, కిషన్‌రెడ్డి మధ్య అంతటి అవినాభావ సంబంధం ఉంది' అని సీఎం అన్నారు.

ఒక సీఎంగా చంద్రబాబును కలిశా...

తాను ఒక సీఎంగా ఏపీ సీఎం చంద్రబాబును కలిశానని రేవంత్‌రెడ్డి అన్నారు. 'చంద్రబాబును కలవడంలో ఎలాంటి దాపరికాలు లేవు. తాను అన్న మాటలతో లోకేశ్‌కు ఎలాంటి సంబంధం లేదు. లోకేశ్‌ను చీకట్లో ఎందుకు కలిశారో కేటీఆర్ చెప్పాలి. లోకేశ్ తమ్ముడిలాంటి వాడని కేటీఆర్ అంటున్నారు. తమ్ముడిలాంటి వాడైతే కష్టకాలంలో అన్నలా ఎందుకు వ్యవహరించలేదు... చంద్రబాబును జైల్లో పెడితే హైదరాబాద్ రోడ్లపైకి జనం వచ్చారు. ఆ జనాన్ని కేటీఆర్ ఎందుకు కొట్టించారు' అని రేవంత్ ప్రశ్నించారు.

అవినీతిని ఉపేక్షించం

(మొదటిపేజీ తరువాయి)

మండలం పోలుమల్లలో కొండ లింగయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం రూ. పదివేలు డిమాండ్ చేసిన కమిటీ సభ్యుడు సత్తెయ్యను, జనగాం జిల్లా దేవరుప్పల మండలం పడమటి తండాలో శివమ్మను రూ.30 వేలు ఇవ్వాలని పంచాయతీ సెక్రటరీ డిమాండ్ చేశారని ఫిర్యాదురాగా విచారణలో ఇందిరమ్మ కమిటీ సభ్యుని పాత్ర ఉందని తేలింది. దీంతో ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి 24గంటల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇళ్లు మంజూరుకాని నలుగురికి వారి ఖాతాలో నిధులు జమచేసిన పంచాయతీ సెక్రటరీలను తక్షణమే సస్పెండ్ చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని అధికారులకు సూచించారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం నిధులు మంజూరు చేస్తున్నామని, అయితే కొన్ని బ్యాంకులు ఈ నిధులను లబ్దిదారుల ఖాతాలో జమచేసి పాత బకాయి కింద జమ చేసుకుంటున్నాయని, ఇటువంటి చర్యలను సహించేదిలేదని, సదరు బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నెంబర్ ఆధారంగా చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలను ఈనెల 25వ తేదీలోగా పరిష్కరించి దసరా పండగలోపు చెల్లింపులు పూర్తిచేయాలని అన్నారు. ఏఈలు కూడా ప్రతి లబ్ధిదారుని వద్దకు వెళ్లి ఆధార్, బ్యాంకు వివరాలను పరిశీలించాలని ఆధార్‌తో బ్యాంకు ఖాతాను అనుసంధానం చేయాలని సూచించారు. పేరు తప్పుఉంటే గ్రామ కార్యదర్శి ... ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి సరిచేయాలన్నారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను ఆయా జిల్లా కలెక్టర్, ఎస్పీకి పంపడంతోపాటు తన కార్యాలయానికి కూడా పంపించాలని అధికారులకు సూచించారు. లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేస్తే 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

ఈడీ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన ప్రాంతాల్లో లెక్కల్లో చూపని రూ.38 లక్షల నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. సీఐడీ ఈ కుంభకోణంపై ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. 2019 అక్టోబర్ నుండి 2024 మార్చి మధ్య అమలు చేసిన కొత్త మద్యం విధానం కిందే భారీ మోసాలు జరిగినట్లు గుర్తించింది. డిస్టిలరీలు, మార్కెటింగ్ సంస్థలను బలవంతపెట్టి ఇన్వాయిస్ విలువలో 15-20శాతం వరకు కిక్‌బ్యాక్ వసూలు చేశారు. చెల్లింపుల ఆలస్యం, షెల్ కంపెనీల ద్వారా డబ్బులు మళ్లించడం, అర్హత నిబంధనలను వక్రీకరణ వంటి విషయాలు ఛార్జిషీట్‌లో ఉన్నాయి. సేకరించిన నిధులను ఎన్నికల ఖర్చులకు, వ్యక్తిగత లాభాల కోసం, విదేశాలకు పంపించడానికి ఉపయోగించారని సిట్ తేల్చింది. దీనిపై దిల్లీలో గత పది రోజులుగా ఈడీ, ఆదాయ పన్ను శాఖ అధికారుల మధ్య చర్చలు సాగుతున్నాయి. ఏపీ మద్యం కుంభకోణంలో సిట్ అధికారులు మూడు ఛార్జిషీట్‌లు దాఖలు చేసిన అంశంపై వారు ఆరా తీశారు. నాలుగు రోజుల క్రితం ఈడీ అధికారులు విజయవాడ వచ్చి సిట్ అధిపతి రాజశేఖర్ బాబుతో చర్చలు జరిపారు. మూడు చార్జిషీట్లు, షెల్ కంపెనీల వివరాలు, సీజ్ చేసిన స్థిర, చరాస్తుల వివరాలను తీసుకున్నారు. ఆ తర్వాత గురు, శుక్రవారాల్లో దేశవ్యాప్తంగా హైదరాబాద్, చెన్నై, దిల్లీలో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ లోని ఏఆర్‌ఈటీఏ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌ఆర్, ఎల్‌ఎల్‌పీ, సువర్ణ దుర్గ బాటిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలపై, సికింద్రాబాద్ లోని రావు సాహెబ్ బూరుగు మహదేవ్ జ్యువెల్లరీస్ సహా మరో కంపెనీలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. అంతేకాకుండా, చెన్నైలోని ఎంఎస్ మోహన్ లాల్ జ్యువెల్లరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ది ఇండియా ఫ్రూట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పైనా దాడులు చేశారు. అయితే, ఈ దాడుల్లో హైదరాబాద్ లోని మహదేవ్ జ్యువెల్లరీస్, చెన్నైలోని బంగారం షాపుల్లో కీలక డేటాను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు తెల్సింది. ఈ నేపథ్యంలో త్వరలోనే కొంతమందికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బ్లాక్ మనీని వైట్‌గా మార్చేందుకు జీఎస్టీ బిల్లులు జారీ చేసి చెల్లింపులు జరిపినట్లు గుర్తించిన ఈడీ అధికారులు, దానికి సంబంధించిన కీలక డేటాను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.175కోట్ల విలువైన బంగారు నాణేలు ఎవరి కోసం కొనుగోలు చేశారన్న దానిపై ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న డేటా, బ్యాంక్ లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పూర్తి నివేదికను ఢిల్లీలో ఉన్న ఉన్నతాధికారులకు పంపించే కార్యక్రమంలో భాగంగా ఈడీ సిట్ అధికారులను సంప్రదిస్తున్నారు.

సర్వతోముఖాభివృద్ధి లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు. జ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరాన్ని గుర్తించి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తితో ముందుకెళుతున్నట్లు చెప్పారు. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. క్రీడల్లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే పతకాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుందని, ఒలింపిక్స్ పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు భూపరివేష్టిత రాష్ట్రం (ల్యాండ్ లాక్డ్) కావడంతో ఓడ రేవు లేదని, మచిలీపట్నం ఓడ రేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే.. దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. మందులు, వ్యాక్సిన్ల తయారీలో తెలంగాణ రాణిస్తోందని రేవంత్ అన్నారు. అమెరికా నిర్ణయాలతో ఆ దేశానికే నష్టమని, అధ్యక్షుడు ట్రంప్ రోజుకో మాట మాట్లాడతారని, ఒకరోజు మోదీ నా మిత్రుడు అని అంటాడు... మరో రోజు అడ్డగోలుగా సుంకాలు విధిస్తారని సీఎం ఎద్దేవా చేశారు. తెలంగాణలోనూ ఒక ట్రంప్ ఉండేవాడని, ఆయనను రాష్ట్ర ప్రజలు పక్కనపెట్టారని మాజీ సీఎంపై విమర్శలు గుప్పించారు.

పత్తి రైతులకు ప్రభుత్వ అండ

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు సీసీఐ సమర్థవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కాటన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పత్తి ఉత్పత్తి, మార్కెట్ ధరల పరిస్థితి, ఎంఎస్పీ అమలు, రైతులకు చెల్లింపులు, జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాట్లు, రవాణా సమస్యలు, డిజిటలైజేషన్, రైతుల రిజిస్ట్రేషన్, స్థానిక కమిటీలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అనేక అంశాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రంలో పత్తి సేకరణలో ప్రభుత్వ సహకారం అవసరమని, దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం కొన్ని నూతన విధానాలు ప్రవేశపెట్టామని, దానికి తగ్గట్టుగా సహాయం అందించాలని మంత్రిని సీసీఐ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో పండే పత్తి ప్రత్యేక నాణ్యత కలిగినదని వివరించారు. ప్రస్తుతం మార్కెట్ ధరలు ఎంఎస్పీ కంటే క్వింటాల్‌కు రూ.1099 తక్కువగా ఉన్నాయని, ఇది రైతులకు ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. అక్టోబరు నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలని, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను 110 నుంచి 122కి పెంచినట్లు మంత్రి వెల్లడించారు. అదనంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తగా కొనరావుపేట ఏఎంసీ కేంద్రాన్ని కూడా చేర్చాలని సూచించారు. రైతులు తమ పత్తిని సులభంగా విక్రయించుకునేందుకు జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లులు, గోదాములు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతులకు ఎంఎస్పీ చెల్లింపులు పూర్తిగా ఆధార్ ఆధారిత ధృవీకరణ తర్వాతే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు. సీసీఐ ప్రవేశ పెట్టిన "కపాస్ కిసాన్" యాప్ ద్వారా రైతులు స్వయంగా స్లాట్ నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఈ యాప్ పై ఏఈఓ లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, వారి ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులు కూడా ఓటీపీ ఆధారంగా నమోదు చేసుకునే వీలుంటుందని, అయితే వారి వివరాలు సంబంధిత పట్టాదారు ధృవీకరించిన తర్వాతే ఆమోదం పొందుతాయని తెలిపారు. ఈ విధానం వల్ల అర్హులంతా ఎంఎస్పీ ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రైతుల పత్తి కొనుగోళ్లు సక్రమంగా జరిగేందుకు ప్రతి కేంద్రంలో స్థానిక పర్యవేక్షక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇవి తేమ శాతం, నాణ్యత, తూకం, ధరల విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పర్యవేక్షిస్తాయన్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 కొనసాగుతాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లులలో సీసీ కెమెరాలు, రోజువారి క్రయ విక్రయాలను పరిశీలించేందుకు డైరెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. గోదాముల నుంచి మిల్లులకు పత్తి రవాణాలో ఆటంకాలు కలుగుతున్నాయని గుర్తించి దీన్ని తక్షణం పరిష్కరించేలా రవాణా శాఖ, జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటే సంవత్సరాల వారిగా ప్రాధాన్యత క్రమంలో విభజన చేయాలని అధికారులను డిప్యూటీ ఆదేశించారు. అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని అన్నారు. హామ్ రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సబ్ కమిటీ సభ్యులు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలో వచ్చిన ప్రతిపాదనలను సమీక్షించారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వివిధ శాఖల కార్యదర్శులు, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. సుజాతనగర్లో జూనియర్ కళాశాల మంజూరైందన్నారు. మైనార్టీ రెసిడెంటిల్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల, రామచంద్ర డిగ్రీ కళాశాల, పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఆర్డీవో మధు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ కత్తి రమేష్, ఈఈ కె.బుగ్గయ్య, డీఈ నాగేశ్వరాచారి, కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, పంచాయితీ రాజ్, విద్యాశాఖ అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆల్మట్టి' ఎత్తు పెంపు రైతాంగానికి మరణ శాసనం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కర్నాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి తెలంగాణ రైతాంగానికి మరణ శాసనం రాస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో జల్సాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచాలని మూడు రోజుల కిందట కర్నాటక మంత్రిమండలి నిర్ణయం తీసుకుంటే దున్నపోతు మీద వాన పడ్డట్టుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విరుచుకుపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కును బొందపెట్టి ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డిలను ఎడారులుగా మార్చేందుకు కర్నాటక కుట్ర పన్నిందని ఆరోపించారు. అక్కడా కాంగ్రెస్సే, ఇక్కడా కాంగ్రెస్సే అయినా మాట్లాడే దమ్ము, ఆపే ధైర్యం లేదా అని రేవంత్ ను నిలదీశారు. కర్నాటక కుట్రను అడ్డుకోకపోతే రైతులతో కలిసి మహోద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనికిరాకుండా పోతుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో 90 శాతం పనులు పూర్తైన పాలమూరు రంగారెడ్డి పథకం నిర్వీర్యం అవుతుంటే పాలమూరు బిడ్డగా చెప్పుకునే రేవంత్ చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. కర్నాటక నుంచి కృష్ణా నీళ్లు రాకపోతే జూరాలే నిండదన్నారు. రేవంత్ మొదలుపెట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కూడా పడావు పడుతుందన్నారు. కేవలం ఐదు అడుగుల ఎత్తు పెంచేందుకు అవసరమైన భూసేకరణ కోసమే రూ.70 వేల కోట్లు ఖర్చు చేయడంతో పాటు లక్షా 30 వేల ఎకరాల భూమిని సేకరిస్తున్నామని కర్నాటక ప్రభుత్వం చెబుతుందన్నారు. మరి ఐదు అడుగుల భూసేకరణకే అంత ఖర్చయితే, మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెల్స్, 1700 కిలోమీటర్ల కాలువలు... 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్ల ఖర్చు చేయడంలో తప్పేం ఉందన్నారు. తెలంగాణ కు కల్పతరువు వంటి కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు చేసింది చిల్లర, డొల్ల, దుర్మార్గ ప్రచారమే అన్న సత్యాన్ని తెలంగాణ ప్రజలు ఇప్పటికైనా తెలుసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపు అంశం సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో ఉండగానే కర్నాటక సర్కారు ఇంత దుర్మార్గమైన నిర్ణయం తీసుకుంటే తెలంగాణ ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని రెండు జీవనదులపై తెలంగాణ రైతుల హక్కులను కాలరాస్తున్న జలదోపిడీకి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయడంతో పాటు రైతులతో కలిసి మహోద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు.

జూబ్లీహిల్స్ జైత్రయాత్రతో కాంగ్రెస్‌కు సురుకు పెట్టాలి

తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్ణయిస్తుందని కేటీఆర్ అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌లో గులాబీ జైత్రయాత్రతోనే సురుకు పెట్టాలన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రక్షగా, గొంతుగా ఉన్న కేసీఆర్ ను లేకుండా చేయాలన్నదే బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడి లక్ష్యం అన్నారు. బీఆర్‌ఎస్‌ని భూస్థాపితం చేస్తే కాంగ్రెస్ ను తేలికగా ఫుట్‌బాల్ ఆడుకోవచ్చని బీజేపీ భావిస్తుందన్నారు. రేవంత్ ప్రభుత్వం చేసిన మోసంతో రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ సంతోషంగా లేరన్నారు. కాంగ్రెస్ -బీజేపీల జాయింట్ వెంచర్ రేవంత్ ప్రభుత్వం అని కేటీఆర్ విమర్శించారు. రాహుల్ గాంధీ ఓట్ చోర్ అంటున్న మోదీని, మోసగాడనే అదానీని రేవంత్ వెనుకేసుకొస్తున్నాడని చెప్పారు. దేశంలోని ముస్లింల మనోభావాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఓటు వేసిందని గుర్తు చేశారు. వక్ఫ్ సవరణలను దేశంలో అందరి కంటే ముందు రేవంత్ ప్రభుత్వమే అమలు చేసిందని అన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ మంత్రులు, నేతలను ముస్లింలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. చరిత్రలో తొలిసారి ముస్లిం మంత్రి లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందన్నారు.

పోషణ మాసోత్సవాలను వినూత్నంగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం

విశాలాంధ్ర - నల్గొండబ్యూరో : జిల్లాలో "పోషణ మాసం" ఉత్సవాలను వినూత్నంగా, ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య ఆరోగ్య, వ్యవసాయ, హార్టికల్చర్, రెవెన్యూ, డిఆర్డిఏ, మున్సిపల్, పంచాయతీ మరియు ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ నుండి వచ్చే అక్టోబర్ 16 వరకు "పోషణ మాసం"ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహించడం, పిల్లలలో లావు (ఒబేసిటీ) తగ్గించేందుకు అవగాహన కల్పించడం, స్థానిక వంటకాలను ప్రోత్సహించడం, మట్టి, చెక్క, కర్ర బొమ్మల వినియోగాన్ని పెంపొందించడం, యోగా చేయించడం, రక్తహీనత నివారణ, శుభ్రత, తాగునీరు, పరిశుభ్రత, కిచెన్ గార్డెన్ల పెంపకం, పోషణ వాటికల నిర్మాణం, గ్రామ, వార్డు సభల నిర్వహణ వంటి విభిన్న కార్యక్రమాలు ప్రతిరోజూ చేపట్టనున్నట్లు వివరించారు.సొంత భవనాలు కలిగిన 625 అంగన్వాడీ కేంద్రాలలో కనీసం 425 కేంద్రాలలో కిచెన్ గార్డెన్లను పెంపకం చేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. ఇందుకోసం అవసరమైన మొక్కలను ఏపీఎంల ద్వారా సమకూర్చుకోవచ్చని, అవసరమైతే విత్తనాలను కూడా అందిస్తామని తెలిపారు. ప్రహరీలు లేని అంగన్వాడీ కేంద్రాలకు బయో కంచెలు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. ఐసిడిఎస్ అధికారులు కేంద్రాలకు అవసరమైన భూములను గుర్తించి భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యుల సహకారంతో సిడిపిఓలు ఒక రోజు ప్రత్యేకంగా పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కిచెన్ గార్డెన్లలో పెంచే కూరగాయలు, మొక్కలపై అవగాహన కల్పించారు. ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణానికి స్థల సేకరణలో సహకరిస్తామని తెలిపారు.

డిఆర్డిఓ శేఖర్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, కిచెన్ గార్డెన్ల ఏర్పాటులో తమవంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. అనంతరం పోషణ మాసం సందర్భంగా రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి, సిడిపిఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ చేపట్టాలి

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : ప్రణాళిక ప్రకారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఈ వీసిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్ డేటా ను 2025 ఎస్.ఎస్.ఆర్ డేటాతో కంపేర్ చేసుకోవాలని ఈ రెండు జాబితాలో కామన్ గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపర్ఇండెంట్ సలీం, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేసే వరకు పోరాటం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేంతవరకు ఉద్యమాలు చేపడతా మని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నేరేడుచర్లలో సిపిఐ ప్రజా సంఘాల బాధ్యులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాది నేత మాదిరిగానే, అలవి కాని వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం సరికాదని ఎన్నికల సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రతి బాలికకు ఎలక్ట్రానిక్ స్కూటీ ఉచితంగా అందిస్తామని 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నాలుగు వేల పెన్షన్లు, వికలాంగులకు 6000 అందిస్తామని కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఉపాధి హామీలో పనిచేస్తున్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 12 వేల రూపాయల ఆత్మీయ భరోసా అందిస్తామని ప్రతి మండల కేంద్రంలో బీసీలకు 50 షాపింగ్ మాల్స్‌తో కూడిన దుకాణాల నిర్మించి ఉచితంగా అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి అవన్నీ మర్చిపోయి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. తక్షణమే మీరు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుంది. మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలక రాజు శ్రీను జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్ యువజన విభాగం నాయకులు చందమళ్ళనవీన్ మచ్చ సందీప్ ఉన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర - వనపర్తి : శుక్రవారం పెద్దమందడి ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు సహకారంతో పాఠ్య పుస్తకాలలో ఉన్న విజ్ఞాన భాండాగారాన్ని పిల్లల్ని ఆకర్షించే విధంగాతరగతి గదులకు కార్టూన్లు, సైంటిస్టుల చిత్రాలతో పెయింటింగ్ వేయించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పెయింటింగ్ వర్క్‌ను పాఠశాల తరగతి గదులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ప్రారంభించి విద్యార్థిని విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. ఎస్పీకి విద్యార్థిని విద్యార్థులు స్వాగతం తెలిపారు. ఎస్పీ విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉందఅన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సత్ప్రవర్తన పై అవగాహన కల్పిస్తున్నాం అని తెలిపినారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తేవాలి, ప్రజలకు సేవలు అందించే విధంగా ఎదగాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సహకరించిన యువతను పాఠశాల ప్రధానోపాధ్యాయులను శాలువాతో ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి విద్యాశాఖ అధికారి, మంజులత, పెద్దమందడి ఎస్సై, శివకుమార్, ప్రసన్న రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బండి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జీకే శ్రీనివాస్, రోజా రాణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: శుక్రవారం గోదావరి ఖని లోని దుర్గా నగర్ లే-అవుట్ కాలనీలో పలు అభివృద్ధి పనులను రామగుండం ఎంమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు.కాలనీ వాసుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ సౌకర్యార్థం స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, కాలనీ అంతటా ఆడియో సిస్టమ్ అమర్చడం, స్థానిక ప్రజలకు అవసరమైన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మండపం నిర్మాణం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, సౌకర్యం, అభివృద్ధి మా ప్రాధాన్యత అని, ప్రతి కాలనీలో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలినీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రైస్తవ మైనారిటీల సమస్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమక్షంలో, కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని క్రైస్తవులు, మైనార్టీలు, అభివృద్ధి సాధించాలని అన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో చర్చి నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, క్రైస్తవుల కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, సమాధుల కోసం స్థలాల కేటాయింపు తదితర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రైస్తవ మైనారిటీల సమస్యల పరిష్కారానికి తగిన సిఫారసులు ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన క్రైస్తవులకు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖాధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు తమ సమస్యలను కమిషన్ చైర్మన్ కు వివరించారు. అనంతరం కలెక్టర్, చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, అసోసియేట్ పాస్టర్లు, జిల్లా స్థాయి క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : ఆరోగ్యవంతమైన మహిళ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చివ్వేంల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలు, ట్రైబల్ వెల్ఫేర్ మినీ గురుకుల పాఠశాలను పర్యటించారు. పోషణ మాసం-2025లో భాగంగా మూడవ రోజు నిర్వహించిన మెన్స్ ట్రీమింగ్ కార్యక్రమంలో రెండవ అంగన్వాడీ కేంద్రంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అధిక పోషక విలువల ఆహారం అందించేందుకు భర్తలు, తండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల మెదడు అభివృద్ధి చెందే దశలో ఉంటుందని, వారికి సమయానికి మంచి పోషకాహారం ఇవ్వడంతో పాటు మంచి విషయాలు నేర్పడం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్త్ నారీ - సుశక్త్ పరిహార్ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ మినీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల బోధన ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో హాస్టల్ వసతులు, భోజన నాణ్యత, బోధన ప్రమాణాలపై వివరాలు తెలుసుకున్నారు. తహసిల్దార్ ప్రకాష్ రావు, ఎంపీడీవో సంతోష్ కుమార్, మెడికల్ అధికారి భవాని, సిడిపిఓ శ్రీవాణి, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఆర్ఐలు ప్రవంతి, శ్రీను, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, సూపర్వైజర్ సునీత, అంగన్వాడీ టీచర్లు ఇందిర, యమున పాల్గొన్నారు.

పారదర్శకంగా రైతులకు యూరియాను అందించాలి

విశాలాంధ్ర- మరిపెడ: సహకార సొసైటీ ద్వారా రైతులకు వేగంగా, పారదర్శకంగా రైతులకు యూరియాను అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. శుక్రవారం ఆయన మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ లో యూరియా పంపిణీ (సరఫరా) కార్యక్రమం, తెలంగాణ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సొసైటీ ద్వారా రైతులకు వేగంగా, పారదర్శకంగా రైతులకు యూరియాను అందించాలని సూచించారు. రానున్న రోజుల్లో వచ్చే యూరియా వివరాలను రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి సమన్వయ పరచాలని తెలిపారు. అనంతరం తెలంగాణ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ని సందర్శించారు స్టడీ అవర్‌లో ఉన్న పిల్లలతో స్వయంగా మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలని, షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ మెయింటైన్ చేయాలని సూచించారు ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, తహసిల్దార్ క్రిష్ణవేణి, మున్సిపల్ కమిషనర్, ఏవో సింగ్ ఉన్నారు.

ఇతర గ్రామాల నుండి కోతులను గూడూరుకి చేర్చరాదు

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు చుట్టుప్రక్కల గ్రామాల నుండి కోతులను గూడూరుకు చేర్చరాదని అలా చేస్తే వారిపై తగిన చర్య తీసుకోబడుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కొమ్మలు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మలు మాట్లాడుతూ గత రెండు మూడు సంవత్సరాల నుండి గూడూరు ప్రజలకు కోతుల బెడద నుంచి విముక్తి కలిగించిన పిదప ప్రజల ప్రశాంతంగా పంట చేనులు, కూరగాయలు, చేతికి అందవొస్తున్నాయని ఆడపడుచులు ప్రశాంతంగా వారి పనులు వారు చేసుకుంటున్నారని వృద్ధులు వికలాంగులు చిన్నారులు సురక్షితంగా జీవనం గడుపుతున్నారని తెలిపారు. ఈ మధ్య పక్క గ్రామాల వారు కావాలని కొండముచ్చు (వానరం), కోతులను తీసుకువచ్చి భయభ్రాంతులను చేస్తున్నారన్నారు. ఇతర గ్రామాల ప్రజలు అలాంటి పనులు మానుకోవాలని కావాలని అలా చేస్తే వారిపై తీవ్రమైన చర్య తీసుకోపడుతుం దనీ తెలిపారు. 300 కోతులకు పైగా పట్టుకొని బోనులో బంధించామని, అడవిలోనీ సురక్షిత ప్రాంతంలో వదిలి వేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ స్వామి, ఎండి రసూల్, ఓర్సు. రాజేందర్, ఎలమందల శ్రీనివాస్, తంగేళ్లపల్లి సునీల్, హెచ్ మనోజ్, ఎద్ల అశోక్ రెడ్డి, నాగేల్లి వీరస్వామి పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర - తొర్రూరు: తొర్రూరు పట్టణం గోపాల గిరి క్రాస్ రోడ్‌లో నిర్మించిన డబల్ బెడ్ రూములు అర్హులైన పేదలకు ఇవ్వాలని శుక్రవారం డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద అర్హులైన పేద మహిళలందరూ బతకమ్మ ఆట ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం) మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ యాకోబు, జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి అర్హులైన పేదలకు ఇల్లు ఇవ్వాలని సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలు చేసామన్నారు. ఆయన అధికారుల్లో స్పందన లేకపోవడంతో అర్హులైన పేద మహిళలు డబల్ బెడ్ రూమ్ ల వద్ద బతుకమ్మ పండుగను చేస్తూ, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఈరోజు నుంచి తొమ్మిది రోజులు బతకమ్మ నిరసనలు తెలుపుతామని విజయదశమి దసరా పండుగ రోజు అర్హులైన పేదలతో గృహప్రవేశాలు చేస్తామని సిపిఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి యాకూబ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్‌లు హెచ్చరించారు. సిపిఐ (ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు జమ్ముల శ్రీను, డొనక దరగయ్య, బొల్లం మమత, ధరావత్ యాకన్న, తిమ్మిటి రవి, ఎస్.కె అమీర్, కొమ్మనబోయిన యాకయ్య, డబల్ బెడ్ రూమ్ అర్హులైన పేదలు శ్రీలత, శోభ, ఎస్ కే సెమినా, వరలక్ష్మి, అమీనా, అరుణ, నాగమణి, ధర్మయ్య, రేణుక, కరుణశ్రీ, యకమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

విశాలాంధ్ర - తుంగతుర్తి : తుంగతుర్తి మండలం రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి మాట్లాడుతూ ప్రజాభాగస్వామ్యంతో మహిళలకు సమగ్ర వైద్య ఆరోగ్య సేవలు అందించడం, ఆరోగ్య సేవలను సులభతరం చేయడం, మహిళల ఆరోగ్య జీవనశైలి మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దీని భాగంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి (ఈఎన్‌టీ, కంటి సమస్యలు, రక్తపోటు, మధుమేహం, నోటి వ్యాధులు), అలాగే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ స్త్రీలకు రక్తహీనత పరీక్షలు, టిబి, కుష్టు వంటి వ్యాధుల నిర్ధారణకు ప్రత్యేక నిపుణులతో పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ప్రముఖ వైద్యులు డా. ఆర్. వైష్ణవి జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్), డా. టీ. అర్చన (ఆర్ వి ఎస్ కే మెడికల్ ఆఫీసర్), డా. సరళ, డా. కిరీటి, డా. మౌనిక రాథోడ్, మధుప్రియా పాల్గొన్నారు.

అరచేతిలోనే ఎస్‌బిఐ బ్యాంకు సేవలు

విశాలాంధ్ర - మోతె : అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే ఎస్బిఐ బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయని డీజీఎం బినోద్ కుమార్ అన్నారు శుక్రవారం మండల పరిధిలోని సిరికొండ గ్రామములో జరిగిన ఆర్థిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్బిఐ ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల వలలో పడి ఉన్నప్పుడు నేరుగా 1930 కి వెంటనే కాల్ చేసి కంప్లీట్ చేయాలని అన్నారు. అకౌంట్‌కు సంబంధించిన లావాదేవీలను సమస్యలను తెలుసుకోవాలనుకుంటే 9022690226 కు వాట్సప్ ద్వారా మెసేజ్ చేసి తెలుసుకోగలరన్నారు. మన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బ్యాంకు నుండి పొందే కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు ప్రతి 60 సంవత్సరాల లోపు వ్యక్తి సంవత్సరానికి 436 రూపాయలు చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రెండు లక్షల బీమా పొడవచ్చు అన్నారు. అదేవిదంగా 2014, 2015 సంవత్సరంలో తీయబడిన అకౌంట్‌లు కేవైసీ అప్డేట్ చేసుకోవాలంటే ప్రతి ఒక్కరు బ్రాంచ్‌కి వెళ్ళకుండా మీ స్మార్ట్ ఫోన్ లో 18001234 నెంబర్‌కు కాల్ చేసి అకౌంటు ఏటీఎం యోనో మరికొన్ని సేవలు అప్డేట్ చేసుకోవాలన్న డి ఆక్టివేట్ చేయాలన్న ఆ నెంబర్ ద్వారా చేసుకోవచ్చని తెలిపారు. ఆర్ ఎం అనిల్ కుమార్, ఏజీఎం నారాయణ, ఎస్బిఐ మేనేజర్ రమేష్, ఎఫ్ఐ మేనేజర్ మూర్తి, ఎస్బిఐ సిఎస్‌పి కాంపాటి శ్రీను, ఎఫ్ఓఎస్ బానోత్ శ్రీను, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎకరాకు 10 వేలు చెల్లించాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: భారీ వర్షాలతో పంట చేలలో ఇసుక మేటలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు 10 వేల నష్ట పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మదేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాయిన్ పల్లి ప్రాజెక్టు కింద కొట్టుకపోయిన కాలువల మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. శుక్రవారం నాయకులు, రైతులతో కలసి కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలలో ఇసుక మేటలతో పొలాలు పంట పండించుకోలేకుండా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం కింద ఎకరాకు రూ. 10 వేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ నుండి మక్త భూపతిపూర్ వెళ్లే దారిలో పుష్పాల వాగు వంతెన పరిసరాలు కోతకు గురై 23 రోజులుగా 7 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఆ గ్రామాల ప్రజలు మెదక్ కు రావాలంటే మూడు రెట్లు ఎక్కువ ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్‌లు మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజా గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్, భీమరి, కిషోర్, కో కన్వీనర్లు కృష్ణ గౌడ్, లింగారెడ్డి, నాయకులు కిష్టయ్య, గట్టయ్య, ప్రభురెడ్డి, సిద్దయ్య, షాకీర్, మోహన్ నాయక్, రవీందర్, బాలేష్, నాగమల్లు, శంకరయ్య, నాగరాజు,కండెల. రవి, ఎంబిపూర్ మహేష్, రైతులు తదితరులున్నారు.

సింగరేణి హాస్పిటల్లో ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ హాస్పిట ల్లో 65 ఏళ్ల వయస్సు వున్న మహిళకు 8 కిలోల బరువు గల కాంప్లెక్స్ ఓవేరియన్ ట్యూమర్‌ను నిపుణ వైద్యుల బృందం విజయవంతంగా తొలగించారు. ఆ మహిళ శాస్త్ర చికిత్స కోసం అనేక ప్రైవేట్ హాస్పిటళ్లకు తిరిగి నప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ శస్త్రచికిత్స క్లిష్టం కాబట్టి కొందరు సూచనల మేరకు సింగరేణి ఆసుపత్రికి రావడం జరిగింది. దింతో శుక్రవారం సింగరేణి వైద్య బృందం కంబైన్డ్ స్పైనల్, ఎపిడ్యూరల్ అనస్థీషియా ప్రాసెస్‌లా శాస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ఇంతకు ముందు ఈ నెల 12 న కూడా ఇదే ఆసుపత్రిలో ఇలాంటి ట్యూమర్ ఆపరేషన్ కూడా విజయవంతంగా చేసినట్లు చెప్పారు. ఈ శస్త్రచికిత్సలో గైనకాలజిస్ట్ మాలతి, జనరల్ సర్జన్ వినూత్న, అనస్థియలిస్ట్ లు కాళేశ్వర్, కృష్ణమూర్తి, రవళి పాల్గొన్నారు. వైద్య బృందాన్ని చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్, అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉష అభినందించారు.

ముందస్తు ప్రణాళికతో గ్రామీణ రహదారుల నిర్మాణం

ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రహదారుల సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ముందస్తు ప్రణాళికతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి జరుగుతున్న పనుల దృశ్యాలు దర్శనమిస్తాయన్నారు. పల్లెలు అభివృద్ధి అయితేనే సమాజభివృద్ధి జరుగుతుందన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని బంగారుచెలక, లక్ష్మీపురం, మైలారం, రేగళ్ల, గట్టుమల్ల గ్రామపంచాయితీల పరిధిలో రూ.1.48 కోట్ల డిఎంఎఫ్టి, ఎన్ఆర్ఈజిఎస్, ఎస్సిపి నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పూర్తయిన కొన్ని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల పరిధిలోని రేగళ్ల-కరకవాగు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగుకు రూ.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ రోడ్డు పూర్తయితే రవాణ సమస్యకు పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను సమకూరుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, దీటి లక్ష్మీపతి, దారా శ్రీను, సత్యనారాయణ, జోగా రామయ్య, గోవిందు, లింగయ్య, రాజు, రాజబాబు, రమేష్, సర్వాన్, రవి, ఎంపిడివో అంకుబాబు, ఆర్ఐ ప్రవీణ్, అధికారులు రవి, వీరన్న, మహాలక్ష్మి, శివలాల్, మెస్సు హుస్సేన్ పాల్గొన్నారు.

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి యాజమాన్యం బండి వైఖరి విడనాడి వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు పిలుపునిస్తామని గుర్తింపు సంఘం ఏఐటీయుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. శుక్రవారం గుర్తింప సంఘం ఎఐటీయుసి బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయం ముట్టడి చేసి ధర్నా నిర్వహించారు. సమస్యలు, డిమాండ్ల మెమోరాండంను జనరల్ మేనేజర్ షాలెం రాజుకు ఇచ్చారు. అనంతరం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రంగయ్యా మాట్లాడుతూ ముఖ్యమైన విషయాల్లో సింగరేణి యాజమాన్యం వైఖరి అభ్యంతరకరంగా ఉందన్నారు. సంస్థ సి అండ్ యండి తో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో కార్మికుల కోసం ఒప్పుకున్న డిమాండ్లపై వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి అందులో 35 శాతం లాభాల వాటాను కార్మికులకు కేటాయించాలని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో కార్మికుల హక్కుల కోసం పోరాటం తప్పదని హెచ్చరించారు. జాప్యం చేస్తూపోతే సమ్మెకు సైతం వెనకాడ బోమని హెచ్చరించారు. కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శిలు గట్టయ్య, రాము, వైస్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, సత్తుపల్లి కార్యదర్శి సుధాకర్, ఆఫీస్ బెరర్లు ఎస్. శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, హీరలాల్, రమేష్, పిట్ కార్యదర్శిలు మధుకృష్ణ, కిషోర్, నర్సింరావు, సౌజన్య, భరణి, సీనియర్ నాయకులు, సురేందర్, మురళి,క్రిస్టోఫర్, గుమ్మడివీరయ్య, కోటి, రవి, కుమార కృష్ణ, భుక్యరమేష్, బండి వెంకటరమణ, కుమార్, మహిళాకార్మికులు పాల్గొన్నారు.

ఆయుర్వేద సేవకుడు విష్ణుకుమార్ పంచార్య మృతి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెంలోని పతంజలి ఆరోగ్య సేవా కేంద్రం నిర్వాహకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు కుమార్ పంచార్య గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కొత్తగూడెంలోని మార్వాడి సమాజం కన్నీటి పర్యంతమైంది. మార్వాడి సమాజంలోని పెద్దలు శుక్రవారం విష్ణు కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతని ఆయుర్వేద వైద్య సేవలను కొనియాడారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలొ మృతుని సోదరులు అశోక్ కుమార్ పంచార్య, మార్వాడి సత్రం మేనేజర్ గోపాల్ పంచార్య, విశ్రాంత రవాణా అధికారి ధనరాజ్ బజాజ్, అశోక్ రాఠీ, వల్లభ దాస్, దామోదర్ దాస్, అటాస్నియా, దుర్గ శంకర్ జాజు, స్థానిక ప్రకృతి ఆశ్రమం కోఆర్డినేటర్ సుగుణారావు, ప్రముఖ సంఘ సేవకులు లగడపాటి రమేష్ చంద్, నరేంద్ర కుమార్ సోనీ, విమల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : బోర్లు, బావులు కింద ఆయిల్ పామ్, ఉద్యాన, మల్బరీ, కూరగాయలు, మునగ వంటి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తే- ఎకరానికి లక్షన్నర ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న అన్నారు. శుక్రవారం జిల్లాలోని నెల్లికుదురు మండలంలోని పలు మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు సాధారణంగా మామిడి తోటలలో ఎకరానికి 20 లేదా 30 లేదా 40 మొక్కలు నాటుతారు. నూతనంగా ఎకరానికి 70 లేదా 160 మొక్కలను అధిక సాంద్రత పద్ధతిలో నాటి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నాణ్యమైన దిగుబడులు పొందుతున్నారు. సంప్రదాయ రకాలు కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న దశేరి, హిమాయత్, కేసరి, అల్ఫోన్సా, బెనేషన్, మల్లికా, గులాబీ, జలాలు, మొదలైనవి సాగు చేస్తున్నారు. ఇరవై సంవత్సరాలు పైబడిన ముదురు తోటలలో ఒక వరుస విడిచి ఇంకొక వరుసలో కొమ్మలు పూర్తిగా తొలగించి, బ్లైటాక్స్ లేదా బోర్డో మిశ్రమం పూయలని, ఐదు నుండి పదిహేను సంవత్సరాలు లోపు ఉన్న చెట్లకి క్రమపద్ధతిలో కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని, శిలీంద్ర నాశిని మందుని స్ప్రే చేయాలన్నారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఉద్యాన విస్తరణ అధికారి టి. విజయపాల్ రెడ్డి, రైతులు తాళ్ళ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు డిఎస్పీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాల అదుపు కోసం ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కల్పించాలని సూచించారు. భాధితులకు అండగా ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్ని పెంచేలని చెప్పారు. డిఎస్పీ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, ఇల్లందు సీఐ సురేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, సబ్ డివిజన్లోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్ పాప భాండం

ఎన్నికల్లో గెలవడానికి కేవలం ప్రధానమంత్రి మోదీ ప్రచార కౌశలం మాత్రమే కారణం కాదు. గెలుపు కోసం మోదీ సారథ్యంలోని బీజేపీ ఎన్నికల కమిషన్‌ను సంపూర్ణంగా తన జేబు సంస్థగా మార్చుకుందని రూఢి అయిపోయింది. కర్నాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలో భాగమైన మహదేవ్‌పురా శాసన సభా నియోజకవర్గంలో లక్ష మందికి పైగా కొత్త ఓటర్లను చేర్చి బీజేపీ ఆ లోక్‌సభ నియోజక వర్గాన్ని ఎలా దక్కించుకుందో రాహుల్ గాంధీ ఇదివరకే బాంబు పేల్చారు. ఆ తరవాత ఆయన "హైడ్రోజన్ బాంబు" పేలుస్తానన్నారు. గురువారం ఆయన హైడ్రోజన్ బాంబు అయితే పేల్చలేదు కాని కర్నాటకలోని అలండ్ శాసనా సభ నియోజకవర్గంలో జరిగిన అవకతవకల గుట్టు విప్పారు. మహదేవ్ పురాలో కొత్త ఓటర్లను చేర్చడంవల్ల బీజేపీ లబ్ధి పొందింది. అలండ్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో ఉన్న వారి పేర్లను తొలగించి కొత్త ఒరవడి దిద్దింది. అలండ్ నియోజకవర్గంలో 6,018 మంది ఓటర్ల పేర్లను సరికొత్త పద్ధతిలో తొలగించారు. ఓటర్ల జాబితాలో ఉండకూడని వారి పేర్లను తొలగించడానికీ ఓ ప్రక్రియ ఉంటుంది. కానీ రాహుల్ గాంధీ చెప్పిన వివరాల ప్రకారం ఆ నియోజకవర్గం వారో, లేదా కర్నాటకకు చెందిన వారో చేసిన ఫిర్యాదు ఆధారంగా కాకుండా ఇతర రాష్ట్రాల వారి అర్జీలతో ఓటర్ల జాబితాలోని ఆరు వేల పైచిలుకు పేర్లు మాయమై పోయాయి. ఫలానా వారి పేర్లు ఓటర్ల జాబితాలోంచి తొలగించాలని ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఎన్నికల కమిషన్ దర్యాప్తు చేసి ఆ పేర్లను తొలగించవచ్చు. కానీ అలండ్ నియోజకవర్గంలో వినూత్న పద్ధతిలో ఆరు వేలమంది పేర్లు తొలగించేశారు. ఎవరి ఓటు అయితే తొలగించారో వారికీ ఈ విషయం తెలియదు. అర్జీ పెట్టుకున్న వారికీ తెలియదు. ఇలాంటి వారిని రాహుల్ గాంధీ గురువారం నాటి మీడియా సమావేశంలో ప్రవేశ పెట్టారు. ఈ అర్జీలన్నీ కర్నాటకేతర ప్రాంతాల నుంచి వచ్చాయి. పైగా ఇది వ్యక్తుల ఫిర్యాదుకు పరిమితమైన వ్యవహారంగా కనిపించడం లేదు. ఈ పని చేయడానికి ఓ కేంద్రీకృత వ్యవస్థ ఉందని రాహుల్ ఆరోపిస్తున్నారు. కాల్ సెంటర్ల ద్వారా ఎలా ఓటర్ల పేర్లు తొలగించేస్తున్నారో రాహుల్ గాంధీ రుజువులు కూడా చూపారు. ఓటర్ల పేర్లు తొలగించాలని ఎక్కడి నుంచో వచ్చిన అభ్యర్థనలను ఎన్నికల కమిషన్ ఎలా మన్నించిందో ఆయన వివరించారు. షరా మామూలుగా ఎన్నికల కమిషన్ "ఇది అసత్యం, నిరాధారం" అని ఖండించింది. ఈ ఓట్ల బందిపోటుపై విచారణ జరిపి ఏడు రోజుల్లోగా వాస్తవం వెల్లడించాలని రాహుల్ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని కోరారు. లేకపోతే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారికి ఆయన అండగా ఉంటున్నారని అనుకోవాల్సి వస్తోందని కూడా రాహుల్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. గురువారం నాటి మీడియ సమావేశంలో రాహుల్ అలండ్‌లో ఆరు వేల మంది ఓటర్ల పేర్లను ఎలా తొలగించారో చెప్పడంతో ఆగకుండా దీని వెనక ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి హస్తం ఉందని ఆరోపించారు. ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఓటర్ల పేర్లు అక్రమంగా తొలగించడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను, మొబైల్ ఫోన్లను వాడారని రాహుల్ చెప్పారు. ఇదే నిజమైతే కచ్చితంగా మన ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలకందమైన ఎన్నికల ప్రక్రియను సమూలంగా ధ్వంసం చేయడమే. దీనికోసం వాడిన మొబైల్ ఫోన్లన్నీ కర్నాటకేతర ప్రాంతాల్లో వాడుతున్నవే. ఉండకూడని వారి పేర్లు ఓటర్ల జాబితాలోంచి తొలగించాలని ఎవరైనా ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. పేర్లు తొలగించడానికి వినియోగించిన ప్రక్రియ అదే కానీ ఫిర్యాదు చేసిన వారు అలండ్ శాసనసభా నియోజకవర్గానికీ లేదా కర్నాటకకు చెందిన వారూ కాకపోవడం చూస్తే ఓటర్ల పేర్ల తొలగింపు వెనక పెద్ద కుట్రే ఉందని, అందులో ఎన్నికల కమిషన్ పాత్ర కీలకమైంది అని నమ్మడానికి బోలెడు అవకాశాలున్నాయి.

ఈ వ్యవహారంపై కర్నాటక ప్రభుత్వ నేర దర్యాప్తు సంస్థ (సీఐడీ) గత 18 నెలలుగా దర్యాప్తు చేస్తోంది. కొందరి ఓటర్ల పేర్లు తొలగించాలని అర్జీ పెట్టారంటున్న వారు వినియోగించిన ఇంటర్నెట్ ఐపీ చిరునామా అందించాలని కర్నాటక సీఐడి గత 18 నెలలుగా ఎన్నికల కమిషన్‌కు నెలకు ఒకటి చొప్పున ఉత్తరాలు రాస్తూనే ఉంది. ఒక్క దానికీ ఎన్నికల కమిషన్ ఇంతవరకు సమాధానం ఇవ్వలేదు. తాను నిరాధారంగా ఎన్నికల కమిషన్ పై ఆరోపణలు చేయడం లేదని, సీఐడీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రాహుల్ గట్టిగా అడిగారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు దర్యాప్తు జరిపించడం ఎన్నికల కమిషన్ బాధ్యత. కానీ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ చలించడం లేదు. ఓటర్లుగా ఉండకూడని వారి పేర్లు తొలగించాలని ఎవరైనా అడగదలచుకుంటే ఫారం 7 నింపి అడగాలి. ఈ ఫారం నింపడానికి కొంత సమయం పడ్తుంది. కానీ ఓ అర్జీ ప్రకారం తెల్లవారు ఝామున నాలుగు గంటలకు ఈ ఫారం అందింది. ఈ ఫారం నింపడానికి సదరు అర్జీదారుడికి పట్టిన సమయం కేవలం 36 సెకన్లే. అంటే ఎక్కడో గోల్‌మాల్ జరుగుతోందనడానికి పెద్దగా శ్రమించనవసరం లేదు. ఓటర్ల పేర్లు తొలగించాలని వచ్చిన అర్జీలన్నీ కాంగ్రెస్‌కు మంచి పట్టున్న పది పోలింగ్ కేంద్రాలకు సంబంధించినవే. సూర్యకాంత్ అనే వ్యక్తి 12 మంది పేర్లను తొలగించాలని అర్జీ పెట్టుకున్నారట. ఈ 12 మందికి సంబంధించి ఫారం ఏడు నింపడానికి పట్టిన సమయం కేవలం 14 నిముషాలు. అసలు ఈ వ్యవహారంతో తనకే సంబంధమూ లేదని సూర్యకాంత్ రాహుల్ మీడియా సమావేశంలో అన్నారు. అంటే అర్జీ పెట్టిన వారూ నకిలీలే. ఒక ప్రత్యేకమైన సాఫ్ట్ వేర్ ఉపయోగించి ఇలా అక్రమంగా పేర్లు తొలగిస్తున్నారన్నది, దీనికి జ్ఞానేశ్‌కుమార్ వత్తాసు ఉందన్నది రాహుల్ గాంధీ ప్రధాన ఆరోపణ. ఇదే సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి 6850 మంది కొత్త ఓటర్లను కూడా చేర్చారు. ఇదంతా ఎవరు చేయిస్తున్నారో జ్ఞానేశ్ కుమార్‌కు తెలియకుండా ఉండదు. కానీ ఖండన మండనలు బీజేపీ నాయకుల నుంచి రావడం చూస్తే ఇదంతా ఏ పార్టీకి ప్రయోజనం చేకూర్చడానికో ప్రత్యేకంగా చెప్పాలా! ఓటర్ల జాబితాను ఎన్ని పద్ధతుల్లో గల్లంతు చేయవచ్చో గమనిస్తే ఊపిరాగినంత పనై పోతుంది. రాహుల్ ఒకే ఆరోపణ పదే పదే చేయడం లేదు. ప్రతి సారీ ఓ కొత్త అక్రమాన్ని బయట పెడ్తున్నారు. హైడ్రోజన్ బాంబు పేలిస్తేనైనా ప్రజలు సచేతనులు అవుతారేమో చూడాలి.

చండీగఢ్ మహాసభకు రాజకీయ ప్రాధాన్యత


డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 25వ జాతీయ మహాసభలు చండీగఢ్‌లో సెప్టెంబరు 21 నుంచి 25 వ తేదీ వరకు జరగనున్నాయి. ఇటీవలే కన్నుమూసిన సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి నగర్‌లో (కిసాన్ భవన్) జరుగుతాయి. అసాధారణ పరిస్థితుల్లో ఈ మహాసభలు జరగనున్నాయి. విధ్వంసకర వరదలలో పంజాబ్ అల్లకల్లోల పరిస్థితుల్లో ఉన్నది. పొలాలు నీట మునిగిపోయాయి. ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జీవన భృతి దెబ్బతిన్నది. ప్రజల పరిస్థితులు తల్లకిందులయ్యాయి. అయినప్పటికీ పంజాబ్ సీపీఐ కామ్రేడ్స్ ఎంతో ఉత్సాహంగా ఏమాత్రం వెనుకాడకుండా మహాసభలను నిర్వహించడానికి సిద్ధమయ్యారు. క్రమశిక్షణతో, విప్లవకర ఉత్సాహంతో మహాసభలకు ప్రతినిధులను, నాయకులను ఆహ్వానిస్తున్నారు. ఎనలేని స్ఫూర్తితో సభలను విజయవంతం చేయనున్నారు. కామ్రేడ్లు సమైక్యంగా న్యాయంగా, సమత్వంగా విప్లవ భావజాలాన్ని కొనసాగించనున్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో పార్టీ 25 వ మహాసభలు జరగడం ఎంతో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నాయి. వలస పాలనకు వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం మహత్తర పోరాటం జరుగుతున్న సమయంలో సీపీఐని స్థాపించారు. అనేక తరాల కామ్రేడ్లు త్యాగాలు చేశారు. శతాబ్ది కాలంగా దృఢ దీక్షతో సామ్రాజ్యవాదానికి, అణచివేతకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేశారు. పార్టీ చరిత్రకు నేడు గర్వపడాలి. ఎంతో గొప్ప బాధ్యతతో పార్టీ పోరాటాలను నిర్వహించింది. పంజాబ్ నేల మనకు స్ఫూర్తినిస్తుంది. సోహన్‌సింగ్ భక్నా నాయకత్వంలో గదర్ ఉద్యమం పుట్టింది. కర్తార్‌సింగ్ సరభ, ఉద్దంసింగ్ తదితర యువకులు జలియన్‌వాలాబాగ్ పోరాటం జరిపారు. భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ పిలుపునిచ్చారు. లెక్కకు మిక్కిలి కామ్రేడ్స్ ఎన్నో త్యాగాలు చేశారు. విప్లవకర స్ఫూర్తితో ఎంతోమంది యువత ప్రాణాలను త్యాగం చేశారు. పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో మహాసభలు జరగనుండటం గర్వపడవలసిన విషయం. యువత నిరంతరం పోరాటం జరిపి ప్రాణాలను అర్పించారు. నాటి యువత స్ఫూర్తితో నేటికీ మనం పోరాటాన్ని సాగిస్తున్నాం.

నేడు ప్రపంచ వ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పలస్తీనా ప్రజలపైన అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో ఇజ్రాయిల్ దాడులు చేసి వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది. పశ్చిమాసియాలో, ఆఫ్రికాలో యుద్ధాలు జరుగుతున్నాయి. ప్రజల అవసరాన్ని అనుసరించి సామ్రాజ్యవాద అధికారంపై తిరుగుబాటు చేసే అవకాశం ఉంటుంది. గుత్త పెట్టుబడిదారీ, ఆర్థిక పెట్టుబడి సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ప్రపంచ పంథాను అధిగమిస్తున్నాయి. సామ్రాజ్యవాదంపై లెనిన్ విశ్లేషించినట్లుగా నేటి పరిస్థితులు ఉన్నాయి. తీవ్రమైన అసమానతలు, ఆకలి, ప్రకృతి విధ్వంసం అలాగే అసాధారణమైన సాంకేతిక పురోగతిని మానవాళి ఏనాడు లేనంతగా అనుభవిస్తోంది. కార్మిక వర్గం, ప్రకృతిని పెట్టుబడిదారీ వ్యవస్థ లూటీ చేయడం కొనసాగుతోంది. కొద్ది మంది బిలియనీర్లు అవుతుండగా కోట్లాది మంది ప్రజలు ఈతి బాధలతో జీవిస్తున్నారు. లాటిన్ అమెరికా నుంచి ఆసియా వరకు ప్రతిఘటన పెరుగుతోంది. అమితమైన కష్టాలను కొనసాగించటానికి ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఇండియా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నది. 2014లో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకుంది. మన రిపబ్లిక్ పునాదులపై నిత్యం దాడులు సాగుతున్నాయి. ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర లేదు. తొలి నుంచి ఇండియా రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని నియంత్రిస్తోంది. పార్లమెంటు రబ్బరు స్టాంపులాగ దిగజారింది. ఫెడరలిజం ధ్వంసం అయ్యే మార్గంలో ఉంది. మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు నిరంతరం దాడులకు గురవుతున్నారు. మీడియా ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచార యంత్రాంగంగా మారుతోంది. ఇండియాను హిందూ రాష్ట్రంగా మార్పు చేసేందుకు ఇవన్నీ చోటు చేసుకుంటున్నాయి. మతవాదం, ఫాసిస్టు ధోరణులు వారసత్వంగా వస్తున్నాయి.

మహాసభల ప్రచారంలో భాగంగా నిర్వహించిన జాతా

మతవాదంతో పాటు దుర్మార్గమైన ఆశ్రిత పెట్టుబడిదారీ పంథా కొనసాగుతోంది. కొద్దిమంది కార్పొరేట్లు వనరులు, విధానాలు, మౌలిక సదుపాయాలను ఏనాడూ లేనంతగా నియంత్రిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాలను నాశనం చేస్తున్నారు. కార్మిక హక్కులను హరిస్తున్నారు. నిరంకుశ విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తోంది. గుత్త పెట్టుబడిదారీ పంథా, నిరంకుశ పాలన ఫాసిజానికి నిర్వచనం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఘటన అవకాశం ఉన్నదని భావించారు. అయితే నిజానికి బీజేపీకి ప్రజలు సీట్లను తగ్గించారు. ఇండియా ఐక్య సంఘటన మధ్య ఐక్యత లేకుండా పోయింది. దీనివల్ల ఎక్కువ సీట్లు గెలుచుకోలేక పోయారు. ఎన్నికలలో గణాంకాలు మాత్రమే ఫాసిజాన్ని అంతం చేయలేదు. ఐక్యత ఆధార సూత్రాలు, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమం నేడు తక్షణ అవసరం. ఈ పోరాటంలో వామపక్షాలు నిర్ణయాత్మక పాత్ర వహించాలి. ఫాసిజానికి వ్యతిరేకంగా స్థిరమైన, ఏమాత్రం రాజీలేని ఐక్యత నేడు ఎంతైనా అవసరం. వామపక్ష ఐక్యత సర్దుబాటు కాదు, చరిత్రాత్మక అవసరం.

సమస్యలు పరిష్కరించుకోటానికి పరిస్థితులను అనుసరించి కొనసాగటానికి కాంగ్రెస్ ధృడత్వం కావాలి. కార్మికులు, రైతులు, యువకులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు ఇతర అణచివేతకు గురవుతున్న వర్గాలపై పోరాటానికి సీపీఐ మరింతగా బలపడాలి.

సామూహిక ప్రజా పోరాటాలకు మనం మరింత ధృడంగా తయారుకావాలి. ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, కుల నిర్మూలన, స్త్రీ పురుషుల న్యాయం, వాతావరణ పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరంతర పోరాటం జరపాలి. సోషలిస్టు భావజాలాన్ని, దృక్పథాన్ని యువత తదితర ప్రజలు నిర్వహించాలి. గదర్ వీరుల నుంచి తెలంగాణ సాయుధ పోరాటం వరకు పోరాటాలలో ప్రాణాలు అర్పించిన వారు శతాబ్ది కాలంగా పోరాటాలకు స్ఫూర్తిప్రదాతలు. అలాగే బాంబే, కలకత్తా కార్మికులు, కేరళలో రైతులు పోరాటం చేశారు. బెంగాల్, పంజాబ్, తమిళనాడు పోరాటాల బలాన్ని నేడు సాధించాలి. భగత్‌సింగ్ మాటలను మనం గుర్తు తెచ్చుకోవాలి. విప్లవం అంటే బాంబులు, పిస్టళ్లు కాదు. సమాజాన్ని రాడికల్‌గా మార్పు చేయాలి. ఛండీగఢ్‌లో వరదలు ప్రతికూలతల మధ్య మనం ఫాసిజాన్ని ప్రతిఘటించాలని పిలుపునివ్వాలి. అలాగే రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. ఇండియాలో సమానత్వం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం ఉధృత పోరాటం చేయాలి. ధైర్యం, ఐక్యత కొనసాగిస్తామని సీపీఐ 25 వ మహాసభలు ప్రతిజ్ఞ చేయాలి.

ఒక్క మాట. ఒక్కటంటే ఒక్కటే మాట...

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

చిత్రం చేస్తుంది. దశాబ్దాల బతుకుల మీద నమ్మకాన్ని పటాపంచలు చేస్తుంది. వాళ్లు అలా అన్నారా...! మనం అలా ఉన్నామా...! ఏకాకీ మాటలేనా ఇవి. ఏ కాకి మాటాలా.. అని అనుమానం వస్తుంది. తెలుసుకోవడానికి ఏమీ మిగలదు. నోరు జారారా... మనిషి జారారా.. అసలు ఎదుటి వాళ్ల గురించి ఏం తెలుసని అలా మాట్లాడారు. గింజుకుంటాం. కల్లోల పడతాం. కలవరపడతాం. కంగారూ పడతాం. అలా నడుస్తూ వెళ్తుంటామా... హఠాత్తుగా ఆటో వచ్చి గుద్దేస్తుంది. "కళ్లు కనపడడం లేదా...! పగలే తాగావా...! ఎక్కడ ఆలోచిస్తున్నావు..! చావాలంటే నా బండే దొరికిందా...! " ఇలా చాలా అంటాడు. అతగాడికి ఏం తెలుసు గాయపడిన గుండె గురించి...! అతనిది బతుకు భయం.. అతని భయం.. జరిమానా వేదన. అతని కంగారు అతని కుటుంబం గుర్తు రావడం...! మనం విన్న మాట.. మనం వినకూడని మాట... మనం వినాల్సి వస్తుందని ఊహించని మాట.. మన దశాబ్దాల జీవితంపై ఓ చెరగని సంతకం వంటి మాట. ఇంతకు ముందు ఎప్పుడూ వినలేదు కదా.. మునుపెన్నడూ సోదిలోకి కూడా రాదని భ్రమలో ఉంటాం కదా. అది తప్పని మనకి తెలియదానికి ఆ మాటే మన కళ్లు తెరిపిస్తుంది. మనల్ని మనమే ప్రశ్నించుకునే మాట. మనల్ని మనమే అనుమానించుకునే మాట. మనల్ని మనమే పుటం పెట్టుకుని పరీక్షించుకోవాల్సిన మాట. వాళ్లు అనేస్తారు. చాలా సులభంగా.. పెదాల నుంచే కదా... వచ్చేస్తుంది. పాటలంటే రాసుకోవాలి. కవిత్వమంటే కాసుకోవాలి. మాటలే కదా... దాచుకోవడం ఏముంటుంది. ఎదుటి వాళ్లని దోచుకోవడమేముంటుంది.

తొలి మాట అత్త కదా...! మలి మాట అమ్మ కదా...! ఎదిగాకే కదా మాటల మూటలను గొంతులో పెంచుకుంటాం. దాచుకుంటాం. బాణాల్లా గుండెల అంబులపొదిలో భద్రపరుస్తాం. గొంతులోంచి వచ్చిన పలుకు ప్రాణం తీస్తుందని ఎరుక ఎక్కువ కలుగుతుంది. సంస్కారానికి, మాటకి పొంతన ఉండదు. మనుగడకు మాటకు తర్కం ఉండదు. వృత్తికి వాక్కుకూ సంబంధం ఉండదు. మనమే ఆ ఒక్క మాటకు ఎండిపోయి జీవం కోల్పోతాం. నిజానికి మనల్ని మనమే కోల్పోతాం. మన చుట్టూ ఉన్న వారినీ కోల్పోతాం. ఆప్తుల్ని, అనేకుల్ని, సమస్త లోకాన్ని వదులుకుని ఒంటరిగా మిగిలిపోతాం. అక్షరం మనకు ఆశ్రయం ఇచ్చిందని నమ్ముతాం కదా. ఆ అక్షరమే అనుక్షణం వెంటాడుతుందని గ్రహింపులోకి రాలేం. నరం లేని నాలుక నాట్యం చేస్తుంది. పైకి దూసుకొచ్చిన పళ్లు పకపకమంటాయి. అతగాడి శారీరక దోపిడికి భుజకీర్తులు తొడగడం ఆధునిక న్యాయం. అలా కూడదన్న పాపానికి మాటల తూటాలు పేల్చడం అత్యాధునిక తీర్పు. న్యాయానికి, తీర్పునకు మధ్య బేధాలుండవు. కోర్టుల్లోనే కాదు... కుత్సిత మనసుల్లోనూ... కుళ్లు మనుషుల్లోనూ కూడా న్యాయాన్యాయాలు బందీ. తీర్పరులు హాయిగా నవ్వేస్తూ ఉంటారు. ఓ మాటని ఫెట్మిల్మన్ వదిలేస్తూ ఉంటారు. ఆ మాటే గుండెల్లో సుడులు తిరుగుతూ నీకు శ్మశానానికి దారి చూపిస్తుంది. అలాగని మరణించవు. రగులుతూంటావు. నిలువెల్లా కుంచించుకుపోయి ఉంటావు. "వీళ్లనా.. నేను అక్కున చేర్చుకున్నానని" ఆవేదిస్తూ ఉంటావు. ఆలోచిస్తూ ఉంటావు. సిగరెట్ చివర నిప్పు రెండు వేళ్ల మధ్యా కాలిన తర్వాత లోకంలోకి వస్తావు. నొప్పి వేళ్లది అనుకుంటావు. గుండెది అని తర్వాత తెలుస్తుంది. నిజానికి నీ గుండె అప్పటికే కాలిపోయి ఉంటుంది. నీ తత్తరబాటు... నీ అనిశ్చితి... నీ వెర్రిబాగులుతనం.. నీ అసహనం... నీ ప్రతిభా... నీ పావటం.. నీ వ్యాకం.. నీ వేదన.. నీ ప్రేమా... నీ వ్యతిరేకత... అన్నీ.. అన్నీ... సమస్తం నిన్ను ఆ ఒక్క మాటతో శక్తిహీనుడ్ని చేస్తాయి. నీ నవ నాడులు కృంగి కృశించిపోతాయి.

"ఒక్కమాటే కదా... అంత ఏముంది అంటుంది" లోకం. మాటంటే పెదవుల మీంచి జారే చప్పుడు కాదు కదా. మాటంటే అసంకల్పితంగా వచ్చే తుమ్మో, దగ్గో కాదు కదా. మాటంటే శరీరం నుంచి వచ్చే ఓ దుర్వాసన కాదు కదా. మాటంటే తూటా. మాటంటే చిక్కని పాట. మాటంటే లాలి. మాటంటే బతకమనే ధైర్యం. మాటంటే భుజం మీద చెయ్యి వేసిన నాన్న. మాటంటే చనుబాల తేట. నీకు ఇవన్నీ తెలియవు కదా. తెలుసుకోవు కదా.. తెలియాలని అనుకోవు కదా. విసిరేస్తావు. ముఖ కవళికలు మారుస్తూ రెండు పెదాలని కిందికి, పైకి జరుపుతూ వదిలేస్తావు. నీకంతగా పట్టింపు ఉండదు. నీకంతగా గ్రహింపు ఉండదు. మాటని... నువ్వు నీ కోపానికి తగిలించిన బాణం అనుకుంటావు. నేనూ.. మాటంటే తల్లడిల్లడం అనుకుంటా. గిలగిల్లాడడం అనుకుంటా. అమావాస్య నాటి చందురుడు అనుకుంటా. సూర్యగ్రహణం నాటి సూర్యుడు అనుకుంటా. నిజానికి నువ్వే కాదు... నేనే కాదు... ఎవరి మాటైనా బతుకు దీపాన్ని వెలిగించాలని కలగంటా. మాటంటే నీకు చిన్న చూపు. మాటంటే నీకు వెక్కిరింత. మాటంటే నీకు వెకిలి చేష్ట. నాకు మాత్రం మాటంటే అమ్మా అనే పిలుపు. మాటంటే నాన్నా అనే ధైర్యం. మాటంటే భార్య ప్రేమ పిలుపు. మాటంటే నా కూతురి పట్టు పావడా. నీకు ఇవన్నీ అర్థం కావులే. మాటని ప్రేమించనంత వరకూ మాట కూడా నిన్ను అసహ్యించుకుంటూనే ఉంటుంది. అదిగో నీ పెదాలు అంటున్నాయి... ప్లీజ్... ఎక్కువ మాట్లాడకు...

సీనియర్ జర్నలిస్ట్, 99120 19929

లౌకిక, ప్రజాస్వామిక, ప్రగతిశీల ఐక్యత దిశగా

సీపీఐ 25వ మహాసభలు


చలసాని వెంకటరామారావు

భారత కమ్యూనిస్టు పార్టీ 25 వ జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్ర రాజధాని చండీగఢ్‌లో సెప్టెంబరు 21-25 తేదీలలో జరగనున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు దేశమంతటా జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించే ఈ మహాసభలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఒకపక్క భారత ఉపఖండంలోని దేశాలు తీవ్ర రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ మహాసభలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒకపక్కన పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రమై అనేక సంపన్న దేశాలలో సైతం ఆర్థిక మాంద్యాలు ఏర్పడుతూ, వాతావరణ విపత్తులు సంభవించి ప్రజా జీవితం అతలాకుతలం అవుతోంది. దీనికి తోడు సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ ఉద్రిక్తతలకు దారి తీస్తున్నది. దీని ఫలితంగా అస్థిరత పెరిగి యుద్ధ వాతావరణం ప్రారంభమై రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ అమానవీయ దాడి ఫలితంగా పలస్తీనాలో వేలాది మంది అమాయక ప్రజల మరణాలకు దారి తీసింది. దీనికి తోడు ఇజ్రాయిల్- ఇరాన్ దేశాల మధ్య యుద్ధం జరిగి పశ్చిమాసియా దేశాలలో అస్థిరత చోటు చేసుకుంది. మరొక పక్క భారత్- పాకిస్థాన్ దేశాల మధ్య పహల్గాం ఉగ్రదాడి ఫలితంగా ఉద్రిక్తతలు చోటు చేసుకుని పరస్పర దాడులకు దారితీసి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనితో అణ్వస్త్ర ప్రయోగం జరగనున్నదనే భయంకర వాతావరణం ఏర్పడింది. ఈ అన్ని దేశాలలో ఉద్రిక్తతల వెనుక అమెరికా ప్రత్యక్ష, పరోక్ష పాత్ర ప్రమాదకరమైన ప్రాంతీయ ఉద్రిక్తతలకు కారణంగా కన్పిస్తున్నది. సైనిక ఉద్రిక్తతలు ఒకపక్క ఆందోళన కలిగిస్తుంటే మరోపక్క ట్రంపు అమెరికా అధ్యక్షునిగా వచ్చిన తదాదిగా ఆర్థిక, వాణిజ్య రంగాలలో ఆంక్షలతో ప్రపంచంలోనే అభద్రతా వాతావరణం ఏర్పడింది. తన ఆధిపత్యం కింద యావత్ ప్రపంచం ఉండాలనే అనైతిక ట్రంపు విధానాల ఫలితంగా ఆర్థిక అస్థిరత చోటు చేసుకుంది. ఈ దశలో అమెరికా- చైనా సంబంధాలలో మార్పులు చోటు చేసుకున్నాయి. భారతదేశం రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేయరాదని అమెరికా ఆంక్షలు విధిస్తున్నది. దీనితో తప్పని పరిస్థితులలో రష్యా, చైనా, ఇండియా, బ్రెజిల్ వంటి దేశాలు ఒకటిగా తమ ప్రయోజనాల కోసం ఐక్యమై డాలరు ఆధిపత్యం, పాశ్చాత్య పెత్తనాన్ని ఎదుర్కోవటానికి సిద్ధమౌతున్నాయి. ప్రపంచంలో ద్రవ్యోల్బణం పెరుగుదల, అప్పులు, వేతనాలు స్తంభించిపోవటం, ఆహార అభద్రత చోటు చేసుకోవటం వంటి కారణాలతో అసమానతలు పెచ్చుమీరి ఆర్థిక పరిస్థితి సంక్లిష్ట దశకు చేరుకుంది. ఇది ప్రపంచ వ్యాపితంగా పేద వర్గాలపై ప్రభావం చూపించి కార్మిక, కర్షక వర్గాలు, పేదలు తీవ్ర ఆందోళనలకు గురై అనేక దేశాలలో ఆందోళనలు, ఉద్యమాలతో హోరెత్తుతున్నాయి. ఈ ఆర్థిక సవాళ్ల నేపథ్యంలోనే మరోపక్క కార్పొరేట్ లాభాలు, సంపద కేంద్రీకరణ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం రోజురోజుకు తీవ్రమౌతున్నది. ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, జర్మనీ వంటి పెట్టుబడిదారీ దేశాలలో సంక్షోభాలు తలెత్తి కార్మిక వర్గ తిరుగుబాట్లకు దారి తీస్తున్నాయి. ఇక యూరప్ ప్రమాదకరమైన రీతిలో మితవాదం దిశగా ప్రయాణిస్తున్నది. రష్యాను ఒంటరి చేసి నాటో విస్తరణకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇక లాటిన్ అమెరికాలో ప్రగతిశీల, వామపక్ష శక్తులు విజయాలు సాధిస్తూ అమెరికా కుట్రలను ఎదుర్కొంటున్నాయి. ఇక భారత ఉపఖండంలోని శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ దేశాలలో ఆంతరంగిక కల్లోల పరిస్థితులు ఏర్పడి స్థానిక ప్రభుత్వాలపై యువత తిరుగుబాట్లు నూతన రాజకీయ పొందికలను ఏర్పరుస్తున్నాయి. ఈ పూర్వ రంగంలో సోషలిస్టు దేశాలు అమెరికా నేతృత్వంలోని ఏక ధృవ ప్రపంచానికి ప్రత్యామ్నాయంగా రూపుదిద్దుకుంటున్నాయి. మానవ అవసరాలకు అనుగుణమైన పాలనా విధానాలను, అంతర్జాతీయ సంబంధాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాయి.



భారత కమ్యూనిస్టు పార్టీ 24 వ మహాసభలు అనంతరం ఈ మూడేళ్ల కాలంలో దేశంలో మత శక్తుల ప్రమాదకర విధాలను వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఐక్యత ద్వారా కొంత వరకు ఎదుర్కోగలిగాం. 2024 సార్వత్రిక ఎన్నికలలో మెజారిటీ కోల్పోయిన బీజేపీ బీహార్, ఆంధ్రలోని ప్రాంతీయ పార్టీల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మైనారిటీలో ఉన్నప్పటికి తన నియంతృత్వ, నిరంకుశ పాలనను కొనసాగిస్తున్నది. బీజేపీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు పక్కనబెట్టి ఆర్ఎస్ఎస్ మతతత్వ ఎజెండాను ముందుకు తెచ్చి పాలన సాగిస్తున్నారు. 130వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను అస్థిరపరచాలని, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను జైలుపాలు చేయాలని కుట్రలు చేస్తున్నారు. రాజ్యాంగ పీఠికలోని సోషలిజం, సెక్యులరిజం పదాలను తొలగించటం ద్వారా ఆర్థిక అసమానత్వాన్ని, మత స్వేచ్ఛను అంతం చేయాలని కుట్ర చేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల నుంచి రక్షణ పొందకుండా నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన సాగించే కుట్రలో భాగంగానే ఈ చర్యలకు పాల్పడుతున్నారు. ఈ రాజకీయ కుట్రలను ఎదుర్కొనే క్రమంలోనే భిన్న సైద్ధాంతిక ఆలోచనలు ఉన్నప్పటికి వామపక్ష, ప్రజాస్వామిక, లౌకిక పార్టీలు "ఇండియా" కూటమిగా ఏర్పడి బీజేపీ మతతత్వ రాజకీయాలను, కుట్రలను అడుగడుగునా ఎదుర్కొంటున్నాయి.

మోదీ ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఉత్పత్తి పెరిగినా రైతుల ఆదాయ పెరగలేదు. కనీస మద్దతు ధర చట్టబద్ధం కాలేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటంతో పేదల వలసలు పెరిగిపోతున్నాయి. 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇచ్చినా కోట్లాది మంది ఆకలి బాధను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం "మేక్ ఇన్ ఇండియా" నినాదాలు పారిశ్రామిక పునరుజ్జీవనం దిశగా సత్ఫలితాలు ఇవ్వటం లేదు. లక్షల పరిశ్రమలు మూతపడుతున్నాయి. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. లక్షల సంఖ్యలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతబడి కోట్లాది మంది ఉపాధి కోల్పోయారు. దేశ స్వాతంత్ర్యానంతరం ఎన్నడు లేని స్థాయిలో నిరుద్యోగ సమస్య యువతను పీడిస్తున్నది. అంతర్జాతీయంగా ఏర్పడిన నూతన పరిస్థితిలో విదేశీ ఉద్యోగ అవకాశాలు కూడా తగ్గిపోయాయి. ఇదే స్థితిలో ప్రపంచ కరెన్సీతో పోలిస్తే భారత రూపాయి విలువ రోజురోజుకు తరిగిపోతున్నది. దేశంలో ద్రవ్యోల్బణం పెరగడంతో ధరలు పెరిగి సామాన్యుల బతుకు భారంగా మారింది. పన్నుల భారం సామాన్యులను కుంగదీస్తున్నది. మరోపక్క సంపన్నుల సంపద పెరిగిపోయి అసమానతలు ఎక్కువ అవుతున్నాయి. ప్రజల సంపదతో కూడబెట్టిన ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. విదేశాంగ విధానంలో నిర్దేశిత అలీన విధానాన్ని పక్కనపెట్టి సామ్రాజ్యవాదులకు అనుకూల విధానాలను అనుసరిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితులలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను ప్రతిఘటించి ప్రజల ప్రయోజనాలను పరిరక్షించటంలో అగ్రగామిగా భారత కమ్యూనిస్టు పార్టీ నిలిచి పోరాడవలసి ఉంది. ఈ కర్తవ్య సాధనలో వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల విశాల వేదికను నిర్మించటంలో క్రియాశీలకమైన పాత్రను నిర్వహించవలసి ఉంది. అందుకు పార్టీ నిర్మాణాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవలసి ఉంది. నూరేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు ఉద్యమం దేశంలో నెలకొన్న ఫాసిస్టు శక్తుల విజృంభణను అదుపు చేసేందుకు తీవ్రంగా పోరాడవల్సి ఉంది. అందుకు పోరాటం, త్యాగం, నిబద్ధతతో కూడిన సంకల్పం పార్టీ శ్రేణులలో కల్పించాలి. నూరేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాలను, పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని భవిష్యత్ పోరాటాలకు పార్టీ సిద్ధం కావాలి. నయా ఉదారవాద పాలక వర్గాల చర్యలను అడుగడుగునా ప్రతిఘటించటానికి పార్టీని సంసిద్ధం చేయాలి. సోషలిజం లక్ష్యంగా శ్రామిక ప్రజలను చైతన్యపర్చవలసిన కర్తవ్యం మన ముందు ఉంది. ఈ దిశగా చండీగఢ్‌లో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ 25 వ మహాసభ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనుంది. మహాసభ కార్యాచరణకు అనుగుణంగా ప్రజలతో మమేకమై ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో ముందున్న కఠినమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు యావత్ పార్టీ సంసిద్ధం కావాలి.

సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు, సెల్: 9490952093

ఆమోదయోగ్యం కాదు

ఫడ్నవీస్‌కు శరద్ పవార్ ఫోన్

ముంబై: ఎన్‌సీపీ (ఎస్‌పీ) సీనియర్ నాయకుడు జయంత్ పాటిల్ తల్లిదండ్రులపై బీజేపీ ఎమ్మెల్యే గోపీచంద్ పదల్కార్ చేసిన వ్యాఖ్యలను ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ తీవ్రంగా ఖండించారు. పదాల్కర్ వ్యాఖ్యలు రాష్ట్ర సంస్కృతికి విరుద్ధమైనవిగా వెల్లడించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. కొల్హాపూర్ పర్యటనలో ఉన్న పవార్ శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఫోన్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే తీరు ఆమోదయోగ్యం కాదని, మహారాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించేలా లేవని, రాష్ట్రం ఎప్పుడు ప్రగతిశీల ఆలోచనలను ప్రోత్సహిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే వైఖరి ఆమోదయోగ్యమైనది కాదని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని ఫడవీస్‌ను పవార్ కోరారు.

మా ప్రధాన స్థావరం ధ్వంసమైంది

లష్కరే కమాండర్

న్యూదిల్లీ: ఇంతకాలం ఆపరేషన్ సిందూర్‌లో తమ పౌరులపై భారత్ దాడి చేసిందని పాక్ చెబుతున్నవన్నీ కట్టుకథలే అని తేలిపోతోంది. తాజాగా దీనిపై లష్కరే తోయిబా టాప్ కమాండర్ ఖాసిమ్ మాట్లాడుతూ మే ఏడో తేదీన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మురిద్కేలో దెబ్బతిన్న ప్రధాన కార్యాలయాన్ని గతంలో కంటే భారీగా నిర్మిస్తామని పేర్కొన్నాడు. 'నేను మురిద్కేలో భారత్ జరిపిన దాడిలో ధ్వంసమైన మర్కజ్ తోయిబా శిథిలాలపై ఉన్నాను. దేవుడి దయ వల్ల గతంలో కంటే భారీగా దీనిని నిర్మిస్తాం' అని తెలిపాడు. ధ్వంసమైన భవనంలో గతంలో చాలామంది ముజాహిద్దీన్‌లు (ఉగ్రవాదులు) శిక్షణ పొందినట్లు వెల్లడించాడు. మరో వీడియోలో ఇదే ఉగ్రవాది పాకిస్థానీ యువత ఇక్కడ ఉగ్రశిక్షణ (దౌరా ఇ సుఫా)లో భాగం కావాలని పిలుపునిచ్చాడు. దీనిలో మతం, జిహాదీ శిక్షణ ఇస్తారు. మరో వీడియోలో లష్కరే డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరీ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం తమకు ఉగ్రస్థావరాల పునర్ నిర్మాణానికి నిధులు ఇచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు 2026, ఫిబ్రవరి ఐదో తేదీన కశ్మీర్‌లో సంఘీభావ దినోత్సవంపై దృష్టిపెట్టినట్లు భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. అప్పటికల్లా మురిద్కేలోని ఉగ్ర కాంప్లెక్స్‌ను పునర్ నిర్మించి సభ నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నిర్మించబోయే భవనమే మరోసారి ఉగ్రశిక్షణ, ఆపరేషనల్ ప్లానింగ్‌కు కేంద్రంగా మారనుంది. ఇటీవల జైషే కమాండర్ ఇలియాస్ కశ్మీరీ కూడా ఓ ప్రసంగంలో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజర్ కుటుంబం చిన్నాభిన్నమైందని అంగీకరించారు.

శరీరం తిరుగుబాటు చేస్తుంది

ఐఎస్‌ఎస్ అనుభవాలు వెల్లడించిన శుభాంశు

న్యూదిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. అంతరిక్షంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యల గురించి ఆయన తాజాగా వెల్లడించారు. దిల్లీలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'స్పేస్ మిషన్ ప్రారంభమైన దగ్గరి నుంచి ఎంతో ఉత్సుకత ఉంటుంది. అయితే మనం మైక్రోగ్రావిటీ పరిస్థితులకు చేరుకుంటాం. అవి మన శరీరానికి పూర్తిగా కొత్త. దాంతో అంతా మారిపోతుంది. రక్తప్రసరణలో తేడా వస్తుంది. ముఖం ఉబ్బుతుంది. గుండెవేగం మందగిస్తుంది. వెన్నెముక సాగుతుంది. తరచూ నడుము నొప్పి వస్తుంటుంది. పొట్టలోని పదార్థాలన్నీ తేలినట్టుగా అనిపిస్తాయి. దాంతో ఆకలి అనిపించదు. అంతరిక్షంలోకి వెళ్లిన మరుక్షణం నుంచే ఈ మార్పులన్నీ వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మన శరీరం తిరగబడుతుంది' అని శుక్లా వివరించారు. ఐఎస్‌ఎస్‌లో ఉన్న సమయంలో తనతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సంభాషణకు ముందు తాను క్లిష్ట పరిస్థితి ఎదుర్కొన్నట్లు చెప్పారు. అప్పుడు తనకు వికారంగా అనిపించిందని, తలనొప్పితో బాధపడ్డానని చెప్పారు. 'వికారానికి మందులు వేసుకుంటే మగత ఉంటుంది. అవి కూడా వేసుకునే వీలు లేకుండా పోయింది' అని చెప్పారు. అప్పుడు తమ బృందం సభ్యులు ఎంతో సహకరించారని చెప్పారు. అక్కడ వ్యోమగాములు ఒకరిపై ఒకరు ఆధారపడాల్సి ఉంటుందన్నారు. ఐఎస్ఎస్‌లోని పరిస్థితులు మన సహనానికి పరీక్ష పెడతాయని చెప్పారు. అయితే బృంద కృషి, పట్టుదల ఎంతో అవసరమన్నారు.

కలిసికట్టుగా ఓటును రక్షించుకుందాం

ప్రియాంకగాంధీ పిలుపు

న్యూదిల్లీ: అందరం ఒక్కతాటిపై నిలిచి ఓటుహక్కును కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందామంటూ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా దేశప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం 'ఒక మనిషి, ఒక ఓటు' అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని రక్షించే లక్ష్యంతో కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఓటు చోరీ సంతకం' ప్రచారంలో చేరాలని కోరారు. ప్రతి వ్యక్తి ఓటు హక్కును కాపాడటానికి, భారత ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచే రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆమె పునరుద్ఘాటించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ప్రతి ఒక్కరి సంతకం.. ప్రతి ఓటులాగే ముఖ్యమైనది. ఒక మనిషి ఒక ఓటు అనే మన ప్రజాస్వామ్య సూత్రాన్ని రక్షించడానికి మాతో చేరండి.. మీ మద్దతును తెలియజేయండి. మనల్ని శక్తివంతమైన ప్రజాస్వామ్యంగా మార్చే మన ప్రతిష్ఠాత్మక రాజ్యాంగ విలువలను రక్షించడానికి, ప్రతి వ్యక్తి ఓటు హక్కు కోసం మేము పోరాడుతున్నాము అని ప్రియాంక ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, ఈ సందర్భంగా ఆమె ఎక్స్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. 'మీరందరూ మా ఓటు చోరీ సంతకం ప్రచారంలో చేరాలని నేను కోరుతున్నాను. ప్రతి ఓటు లెక్కించినట్లే.. ప్రతి సంతకం కూడా లెక్కించబడుతుంది. అలాగే ప్రజాస్వామ్యం కోసం.. రాజ్యాంగం కోసం.. రాజ్యాగ విలువల కోసం నిలబడే మీ ప్రతి గొంతు లెక్కలోకి వస్తుంది. మీ గొంతును పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది' అని ప్రియాంక పేర్కొన్నారు.

బీజేపీతో కలిసి ఈసీ అబద్ధాలు

ఓట్ల దొంగతనంపై ప్రియాంక్ ఖర్గే

బెంగళూరు: ఓట్ల చోరీకి సంబంధించిన మొత్తం సమాచారాన్ని అందజేసినట్లు బీజేపీతో కలిసి ఎన్నికల సంఘం అబద్ధం చెబుతోందని కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే శుక్రవారం ఆరోపించారు. ప్రియాంక్ ఖర్గే ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సీఐడీ 18 లేఖలు రాసిందని, తాజా లేఖ ఫిబ్రవరి 1, 2025న వచ్చిందని, దర్యాప్తు కోసం సంబంధిత సమాచారాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ను కోరిందన్నారు. 'దర్యాప్తు సమయంలో ఐపీ (ఇంటర్నెట్ ప్రోటోకాల్) లాగ్‌లు అందించబడ్డాయి. గమ్యస్థానాన్ని పరిశీలించినప్పుడు... ఐపీ గమ్యస్థాన పోర్ట్ కనిపించడం లేదు. అందువల్ల సంబంధిత వ్యక్తులను వాటిని అందించమని, క్రింది పేర్కొన్న ప్రశ్నలకు సంబంధించిన సమాచార పత్రాన్ని కూడా అందించమని ఆదేశించమని అభ్యర్థించడం జరిగింది' అని సీఐడీ లేఖను ప్రియాంక్ చదివి వినిపించారు. మంత్రి చెప్పిన దాని ప్రకారం... సీఐడీకి ఐదు ప్రశ్నలు ఉన్నాయి. 'నేషనల్ ఓటర్ల సర్వీస్ పోర్టల్ (ఎన్‌వీఎస్‌పీ), ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) ప్లాట్‌ఫారమ్‌లు ఓటీపీ మల్టీఫ్యాక్టర్ ప్రామాణీకరణ సౌకర్యాన్ని స్వీకరించాయా లేదా. దరఖాస్తులను అప్‌లోడ్ చేయడానికి ఓటీపీ ప్రామాణీకరణ సౌకర్యాన్ని పొడిగించారా, అలా అయితే, వివరాలను అందించండి. అలాగే ఓటీపీ వంటి ప్రామాణీకరణ ఉనికిలో ఉన్నట్లయితే, లాగిన్ కోసం ఉపయోగించే మొబైల్ నంబర్‌కు ఓటీపీ పంపబడుతుందా లేదా దరఖాస్తుదారు లేదా ఇద్దరూ ఫారమ్‌లో అందించిన మొబైల్ నంబర్‌కు పంపబడుతుందా. అదేవిధంగా కార్యకలాపాల సమయంలో లాగ్‌లు సృష్టించబడిన, చట్ట అమలు సంస్థ ముందు సమర్పించడానికి రూపొందించబడిన చట్టబద్ధమైన నియంత్రణ వినియోగదారుని కలిగి ఉన్న వ్యక్తి ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లోని 65బి కింద సర్టిఫికెట్‌ను అందించండి. ద్వితీయ రూపంలో ఎలక్ట్రానిక్ పరికరాన్ని సాక్ష్యంగా అంగీకరించడానికి 65బి సర్టిఫికెట్ తప్పనిసరి అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఎన్‌వీఎస్‌పీ, వీహెచ్‌ఏ, గరుడ యాప్‌ల దశలవారీ వినియోగానికి సంబంధించి ఓటర్లు/ప్రజల దృక్కోణం నుంచి దర్యాప్తు బృందానికి ఒక ప్రజెంటేషన్ ఏర్పాటు చేయాలని సంబంధిత వారిని ఆదేశించండి' అని పేర్కొంటూ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయం ఫిబ్రవరి 4న భారత ఎన్నికల సంఘానికి లేఖను పంపిందని ప్రియాంక్ ఖర్గే తెలిపారు. 'మీరు ఎవరికి అబద్ధం చెబుతున్నారు? మీరు అన్ని సమాచారాన్ని అందించినట్లయితే, మీరు ఈ లేఖ ఎందుకు రాశారు' అని ఖర్గే ప్రశ్నించారు.

'మోదానీ' స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు

కాంగ్రెస్ డిమాండ్

న్యూదిల్లీ: అదానీకి సెబీ క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. హిండెన్‌బర్గ్ విషయంలో అదానీ గ్రూప్‌నకు సెబీ క్లీన్‌చిట్ ఇచ్చిన ఒక రోజు తర్వాత ఈ వ్యాఖ్యలు చేసింది. 'మోదానీ ఎంటర్‌ప్రైజెస్'లోని వాణిజ్య భాగస్వామి ఇప్పుడు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్న 20 విషయాలలో రెండింటిలో మాత్రమే సెబీ నుంచి 'క్లీన్‌చిట్' పొందిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ నియంత్రణ సంస్థ దర్యాప్తు పరిధికి మించి విస్తరించి ఉన్నందున 'మోదానీ కుంభకోణం'ను అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. 100 ప్రశ్నల సిరీస్ 'హమ్ అదానీ కే హై కౌన్' (హెచ్‌ఏహెచ్‌కే) పార్టీ అడిగిన ప్రశ్నల జాబితాను కూడా ఆయన పంచుకున్నారు. వాటికి సమాధానం లేదని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత 'రెండు నెలల్లో దర్యాప్తు ముగించాలని' మార్చి 2, 2023న సుప్రీం కోర్టు సెబీని ఆదేశించిందని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'అయినప్పటికీ తరచూ పొడిగింపులు, జాప్యాలతో రెండు సంవత్సరాల ఏడు నెలల తర్వాత మాత్రమే సెబీ ఆదేశాలు జారీ అయ్యాయి. 'మిగిలిన 22 విషయాలపై సెబీ ఫలితాల కోసం మేము ఎదురు చూస్తున్నాము. వీటిలో అదానీ గ్రూప్ కంపెనీలలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు, కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌కు సంబంధించిన నిబంధనలు, ఆగస్టు 25, 2023న దర్యాప్తు చేస్తున్నట్లు సెబీ సుప్రీం కోర్టుకు చెప్పిన 13 'అనుమానాస్పద లావాదేవీలు' ఉన్నాయి. వీటిలో అదానీ సన్నిహిత సహచరులు నాసర్ అలీ షాబాన్ అహ్లీ, చాంగ్ చుంగ్-లింగ్ చేసిన ఆఫ్‌షోర్ లావాదేవీలు ఉన్నాయి' అని ఆయన తెలిపారు. అయితే మోదానీ కుంభకోణం సెబీ దర్యాప్తు పరిధికి మించి విస్తరించి ఉందని ఆయన నొక్కి చెప్పారు. హెచ్‌ఏహెచ్‌కే ప్రశ్నల శ్రేణిలో కాంగ్రెస్ తన వంద ప్రశ్నల జాబితాలో ప్రధాన మంత్రికి సంధించిన అంశాలను ఆయన లేవనెత్తుతూ, ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి ఏజెన్సీలను దుర్వినియోగం చేసి అదానీ గ్రూప్‌నకు తమ ఆస్తులను విక్రయించమని కంపెనీలను 'బలవంతం' చేశారని కూడా ఆయన అన్నారు. భారతదేశంలో అధిక ధరల సౌర విద్యుత్ కాంట్రాక్టులను పొందేందుకు గౌతమ్ అదానీ, ఏడుగురు సహచరులు రూ.2 వేల కోట్ల 'లంచం పథకం' నిర్వహించారని జైరాం రమేశ్ ఆరోపించారు. విమానాశ్రయాలు, ఓడ రేవులు వంటి కీలకమైన మౌలిక సదుపాయాల 'పక్షపాత ప్రైవేటీకరణ' పై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ కూడా డిమాండ్ చేస్తోందని తెలిపారు.

కులమతాలు లేని రాజకీయం చేస్తాం

యువత ఆకాంక్షలు తెలియని సీఎం నితీశ్: తేజస్వి

పట్నా: కులాన్ని, మతాన్ని విడనాడి, అభివృద్ధి కోసం కొత్త రాజకీయం చేస్తామని ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ వక్కాణించారు. ప్రతి రంగంలో అభివృద్ధి, మెరుగుదల, సుసంపన్నత, పరిశ్రమల కోసం రాజకీయాలు చేయడానికే వచ్చానంటూ ఆయన శుక్రవారం ఉద్ఘాటించారు. మార్పు కోసం... హక్కులు, ఆర్థిక విప్లవం కోసం బీహార్ యువత ఒక్కటైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం చావో-రేవో అన్నట్లుగా రాజకీయ పోరు సాగుతోందని, ఈ పోరాటంలో బీహార్‌ను విజయ పథంలోకి తీసుకొచ్చేంత వరకు విశ్రమించేది లేదని తేజస్వి ప్రకటించారు. బీహార్‌లో ఆదాయం, పెట్టుబడులు పెంపుదల కోసం చర్చ జరుగుతోందని అన్నారు. సానుకూలత, సృజనాత్మకత, ప్రగతిశీలత, నాణ్యత ఆధారిత పరివర్తనమే రాజకీయాలకు ఆధారమని తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న దృష్ట్యా ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని చేపట్టారు. ఖగారియా జిల్లా సహా ఇటీవల నిర్వహించిన ర్యాలీల వీడియోలు సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. బీహార్‌లో ప్రస్తుత రాజకీయ పోరు యువత, రైతుల భవిష్యత్తు కోసం పోరాటమని తేజస్వీ యాదవ్ అన్నారు. రైతుల చెమట... కార్మికుల కష్టం కోసం జరిగే పోరాటం. నిరుద్యోగ యువత భవిష్యత్ కోసం ఉద్యమం' అని వ్యాఖ్యానించారు. ఈ పోరాటంలో బీహార్‌ను విజయపథంలోకి తీసుకొచ్చేంత వరకు విశ్రమించబోనన్నారు. బీహార్ యువత ఆకాంక్షలతో నితీశ్ తెగతెంపులు చేసుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చుట్టూ రిటైర్డ్ అధికారులు, అలసిపోయిన నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. యువత ఆశలు, ఆకాంక్షలు తెలియని ముఖ్యమంత్రి భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు హామీనిచ్చేలా విధానాలను రూపొందించలేరని తేజస్వి అన్నారు. చుట్టూ రిటైరైన అధికారులు, అలసిపోయిన నేతలుంటే విద్యార్థులు, యువత ఆశయాలు ఎప్పటికీ అర్థం కావు' అని ఎక్స్ మాధ్యమంగా దుయ్యబట్టారు.

బాంబే హైకోర్టుకు మళ్లీ బాంబు బెదిరింపు

ముంబై: బాంబే హైకోర్టుకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. కోర్టును పేల్చేస్తామని శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి మెయిల్ చేశాడు. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీస్ బలగాలను రప్పించి ముందుజాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు లోపలికి వచ్చే వాహనాలను, కోర్టు బయటికి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబు లేదని తనీఖీల్లో తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని ట్రేస్ చేసి పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కాగా కోర్టు కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలుగలేదు. కాగా బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో వారం రోజుల్లో ఇది రెండోసారి.

పక్కా ప్రణాళికతో దాడులు

ఆపరేషన్ సిందూర్‌పై వాయుసేన అధిపతి

న్యూదిల్లీ: బాలాకోట్ దాడులు చేసినప్పుడు ఏమీ కనిపించడం లేదంటూ తమని పదేపదే ప్రశ్నించారని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మాత్రం పక్కా ప్రకాళికతో వ్యవహరించినట్లు వెల్లడించారు. ఆయన న్యూదిల్లీలో జరిగిన వార్షిక సమావేశంలో మాట్లాడుతూ అనేక విషయాలు వెల్లడించారు. 'బాలాకోట్‌పై దాడులు చేసిన సమయంలో మన వాళ్లే చాలా ప్రశ్నించారు. మనం మనవాళ్లనే ఎక్కువ అడుగుతాము. పక్కన వాళ్ల గురించి పట్టించుకోము. అక్కడేమీ కనిపించడం లేదు అన్నారు. బాలాకోట్ ఉపగ్రహ చిత్రంలో కేవలం మూడు చుక్కలు కనిపిస్తున్నాయి. మాకు అక్కడ లోపల ఏం జరిగిందనే దానిపై ఇంటెలిజెన్స్ లేదు. వారికి చెప్పలేకపోయాం. కానీ, హ్యూమన్ ఇంటెలిజెన్స్‌తో అక్కడ ఎంత మంది చనిపోయారు... అంత్యక్రియలు ఎన్ని జరిగాయనేది తెలిసింది. అయినా మనవాళ్లకు నచ్చజెప్పలేకపోయాం. ఈ సారి (ఆపరేషన్ సిందూర్) చూడండి... మురిద్కేలో కూడా చిన్న చుక్కలానే ఉపగ్రహ చిత్రంలో కనిపించింది. కానీ, ఈసారి జర్నలిస్టు ఒకరు దానిని కవర్ చేశారు. మురిద్కేలోని లష్కరే స్థావరం ఎంతగా దెబ్బతిందో తెలుస్తుంది. మా ఆయుధ సామర్థ్యాన్ని ప్రశ్నించిన వారు అక్కడి భవనంపై ఏర్పడిన రంధ్రాలు చూస్తే తెలుస్తుంది. గతం నుంచి పాఠాలు నేర్చుకొన్నాం. ఈసారి బలమైన రాజకీయ సంకల్పంతో రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. త్రివిధ దళాలు సీడీఎస్, ఇతర ఏజెన్సీలతో కూర్చొని మాట్లాడుకొని పక్కా ప్రణాళిక చేసుకొన్నాయి' అన్నారు. అంతకుముందు ఏపీ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ కోసం వాడిన ఆయుధాల వివరాలు చెప్పారు. 'ఈసారి చాలా వరకు ఇటీవల దళాల్లో చేరినవే ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా భారత్ కృషితో సిద్ధమైనవే. ఉగ్రవాదులే మాకు లక్ష్యాలను ఇచ్చారు. మేము కచ్చితత్వంతో వాటిని ఛేదించాము. ఆ తర్వాత శత్రువు యుద్ధాన్ని ఆపకుండా మాతో పోరాటానికి వచ్చారు. అప్పుడు మేము వారి చాలా బేస్‌లు, ఆయుధాలు, వ్యవస్థలు, రాడార్లు, కంట్రోల్ కమాండ్ సెంటర్లను ధ్వంసం చేశాము. ఇవన్నీ ఇంటర్నెట్‌లో ఉన్నాయి' అని వివరించారు.

పదేళ్లుగా ఆకులే ఆహారం

బెళగావి: కర్నాటకలోని బెళగావికి చెందిన ఓ వ్యక్తి పదేళ్లుగా కేవలం పచ్చి ఆకులే తిని జీవిస్తున్నాడు. ఉగరగోళ గ్రామానికి చెందిన 34 ఏళ్ల బుడాన్ పదేళ్లుగా తన గ్రామానికి సమీపంలోని అడవుల్లో నివసిస్తున్నాడు. ఆకు కూరలు తింటూ క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తూ కొండప్రాంతాల్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. తెల్లవారుజామున 3 గంటలకు నిద్రలేవడంతో అతడి రోజు ప్రారంభమవుతుంది. లేచింది మొదలు అడవిలోని కొండలు, చెట్లు ఎక్కుతూ ఆకుకూరలు తిని... అక్కడి నదుల్లో ప్రవహించే నీటిని తాగుతూ జీవిస్తున్నాడు. రోజుకు కనీసం రెండుసార్లు తప్పకుండా యోగా చేస్తూ...50కి పైగా ఆసనాలు వేస్తానని బుడాన్ తెలిపాడు. అతడి ముందు ఎంతటి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టినప్పటికీ ముట్టుకోడు. జంతువులు ఆకులు తింటూ బతుకుతుంటూ... తానెందుకు బతకలేననే ఆలోచన రావడంతో ఈ విధంగా సాత్విక జీవనం గడుపుతున్నానన్నాడు. ఇప్పటి వరకు దాదాపు 80కి పైగా రకాల ఆకులు తిన్నట్లు బుడాన్ తెలిపాడు. వాటిని తినడం వల్లే ఈ పదేళ్లలో తాను ఏ రకమైన అనారోగ్యానికి గురి కాలేదని, వైద్యులను సంప్రదించలేదని అన్నాడు. చిన్నప్పుడు అన్నం, చపాతీలు, మాంసం, పండ్లువంటి అన్ని రకాల ఆహార పదార్థాలూ తినేవాడినని, ఇప్పుడు వాటన్నింటినీ పూర్తిగా మానేశానని చెప్పాడు. దుస్తులు, ఇతర వస్తువుల కోసం డబ్బు అవసరమైనప్పుడు గ్రామంలో అన్ని రకాల పనులు చేయడానికి వెళతానని తెలిపాడు.

పాక్ వెళితే సొంతింటి భావన

శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ ఛైర్మన్‌గా శామ్‌పిట్రోడా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశాలకు ప్రాధాన్యమిచ్చేలా మన విధానాలు ఉండాలని సూచించిన ఆయన... పాకిస్థాన్ వెళ్లినప్పుడు తనకు సొంతింట్లో ఉన్న భావన కలిగిందని చెప్పారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన సొంతపార్టీని ఇరకాటంలో పెట్టారు. 'మన విదేశాంగ విధానంలో మొదట మన పొరుగుదేశాలపై దృష్టిపెట్టాలన్నది నా అభిప్రాయం. పొరుగుదేశాలతో మనం సంబంధాలను గణనీయంగా మెరుగుపర్చుకోగలమా? ఇక్కడ మీకో విషయం చెప్పాలని అనుకుంటున్నాను. పాకిస్థాన్ వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న భావన కలిగింది. బంగ్లాదేశ్, నేపాల్‌కు వెళ్లినప్పుడు కూడా అలాగే అనిపించింది. పరాయి దేశంలో ఉన్నట్టు అనిపించలేదు' అని శామ్ పిట్రోడా చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 'పాక్ వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న భావన కలిగిందని రాహుల్ గాంధీ ఎంతో ఇష్టపడే వ్యక్తి శామ్ పిట్రోడా చెప్పారు. 26/11 మారణహోమం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం పాక్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు' అని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వారసత్వ పన్ను విధానంపై శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అమెరికాలోని ఓ విధానాన్ని ఉటంకిస్తూ 'ఒక వ్యక్తి దగ్గర 100 మిలియన్ల డాలర్ల విలువైన సొత్తు ఉందనుకుంటే... ఆ వ్యక్తి మరణం తర్వాత అందులో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు బదిలీ అవుతుంది. మిగిలిన 55 శాతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది' అని వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలో చైనా గురించి మాట్లాడిన మాటలపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. తన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు రావడంతో పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆయనను అదే పదవిలో నియమించింది.

హాఫీజ్ సయీద్‌ను కలిశా

మన్మోహన్ ధన్యవాదాలు చెప్పారు: మాలిక్

న్యూదిల్లీ: ఉగ్రవాద నిధుల కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్(జేకేఎల్ఎఫ్) ఉగ్రవాది యాసిన్ మాలిక్ సంచలన విషయాన్ని బహిర్గతం చేశాడు. 2006లో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా అధ్యక్షుడు, 26/11 దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌ను కలిశానని, ఆ తర్వాత అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తనకు వ్యక్తిగతంగా ధన్యవాదాలు చెప్పారని మాలిక్ తెలిపాడు. ఆగస్టు 25న దిల్లీ హైకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌లో మాలిక్ ఈ విషయాన్ని పేర్కొన్నాడు. ఉగ్రవాదిని కలవడం తన వ్యక్తిగత చొరవ కాదని, పాకిస్థాన్‌తో తెరవెనక శాంతి ప్రక్రియలో భాగంగా భారత నిఘా అధికారుల అభ్యర్థన మేరకు కలిశానని వివరించాడు. అప్పటి ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) స్పెషల్ డైరెక్టర్ వీకే జోషి 2005లో కశ్మీర్‌లో సంభవించిన భూకంపం తర్వాత పాకిస్థాన్ పర్యటనకు ముందు దిల్లీలో తనను కలిసినట్లు మాలిక్ అంగీకరించాడు. పాకిస్థాన్ రాజకీయ నాయకత్వంతోనే కాకుండా అప్పటి ప్రధాని మన్మోహన్ శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి సయీద్ సహా ఉగ్రవాద వ్యక్తులతో చర్చలు జపడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జోషి కోరినట్లు మాలిక్ వెల్లడించాడు. ఉగ్రవాద నాయకులను చర్చల్లోకి తీసుకోకుంటే... పాకిస్థాన్‌తో చర్చలు అర్థవంతంగా ఉండవని తనకు చెప్పినట్లు మాలిక్ పేర్కొన్నాడు. ఈ అభ్యర్థన మేరకే పాకిస్థాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సయీద్‌తో పాటు యునైటెడ్ జిహాద్ కౌన్సిల్ ఇతర నేతలను కలిసేందుకు తాను అంగీకరించినట్లు వెల్లడించాడు. మాలిక్ పాకిస్థాన్ నుంచి భారత్ వచ్చిన తర్వాత ఈ సమావేశాల గురించి వివరించాడు. ఐబీ విచారణ తర్వాత ప్రధానమంత్రికి నేరుగా సమావేశాల గురించి వివరించాలని తనను అడిగినట్లు మాలిక్ తెలిపాడు. దిల్లీలో అప్పటి జాతీయ భద్రతా సలహాదారు ఎంకే నారాయణ్ సమక్షంలో మన్మోహన్ సింగ్‌ను కలిసినట్లు చెప్పాడు. ఉగ్రవాదులతో తాను చూపిన కృషి, సహనం, అంకితభావాన్ని మన్మోహన్ సింగ్ కొనియాడారని, ధన్యవాదాలు చెప్పారని పేర్కొన్నాడు. ఈ అఫిడవిట్‌లో అతల్ బిహారీ వాజ్‌పేయి, సోనియా గాంధీ, పి. చిదంబరం, ఐకే గుజ్రాల్, రాజేష్ పైలట్ సహా అనేక మంది అగ్ర రాజకీయ నేతలతో తన సమావేశాల గురించి మాలిక్ సుదీర్ఘంగా ప్రస్తావించాడు.

టీవీకే అధినేత విజయ్ ఇంట్లో అగంతకుడు

చెన్నై: తమిళనాడుకు చెందిన ప్రముఖ నటుడు, తమిళ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్ ఇంట్లో భద్రతా వైఫల్యం బయటపడింది. ఒక అగంతకుడు నీలంకరైలోని విజయ్ ఇంట్లోకి చొరబడ్డాడు.

ఇంటి టెర్రస్‌పై తిరుగుతూ కనిపించాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు అరుణ్ (24)గా గుర్తించారు. గత నాలుగేళ్లుగా అతడి మానసిక స్థితి సరిగ్గా లేదని ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న విజయ్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. విజయ్‌కి భద్రతను పెంచాలని కోరారు.

మలేసియాలో మోదీ-ట్రంప్ భేటీ?

న్యూదిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో భేటీ కానున్నారు. అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి మోదీ, ట్రంప్ హాజరవుతారు. ఈ సదస్సుకు అనుబంధంగా మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం రెండు దేశాల నేతలు మొదటిసారి భేటీ కానున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ వ్యాఖ్యలు, భారత్‌పై టారిఫ్‌ల వేళ ఈ భేటీ జరుగుతుండటంతో అందరి దృష్టి దానిపైనే ఉంది. ట్రంప్ అక్టోబర్‌లో మలేసియాకు వచ్చే అవకాశముందని ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఇటీవల చెప్పారు. ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి హాజరవ్వాలనుకుంటున్నట్లు ట్రంప్ తనకు ఫోన్ చేసి చెప్పారన్నారు. అయితే ఈ భేటీపై ఇంకా అమెరికా, భారత ప్రభుత్వాలు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల మోదీ పుట్టినరోజు సందర్భంగా ట్రంప్ ఆయనకు ఫోన్ చేశారు. ఆ సమయంలో ఈ ఏడాది భారత్‌లో జరగనున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సుకు రావాలని ట్రంప్‌ను మోదీ కోరగా... అందుకు ఆయన అంగీకరించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన మోదీ... అక్కడ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు. ఈ భేటీ అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం కొన్ని గంటల్లోనే ట్రంప్ స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని చెప్పుకొచ్చారు. మోదీని ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ సన్నిహిత స్నేహితుడే అయినా రష్యా నుంచి చమురు కొనడం వల్ల అధిక సుంకాలు విధించాల్సి వచ్చిందని స్పష్టంచేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం

ట్రావెల్ టూరిజం ఫెయిర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని, పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యంగా త్వరలోనే తెలంగాణలో అత్యున్నత స్థాయి టూరిజం కాన్క్లేవ్ ను నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ట్రావెల్, టూరిజం ఫెయిర్-2025 ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇటీవల నూతన పర్యాటక విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. పర్యాటకం కేవలం వినోదం కాకుండా ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం కొత్త టూరిజం పాలసీ ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నది. వివిధ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకు రావాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ఇది విస్తృతమైన అవకాశాలను కల్పిస్తుంది. టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టండి. వారికి పూర్తిగా మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చర్చలకు, పెట్టుబడి ప్రణాళికలకు, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని వెల్లడించారు. మీరు మా రాష్ట్రాన్ని అన్వేషించేటప్పుడు, మా పర్యాటక అవకాశాలను ప్యాకేజ్ చేయటంలో భాగస్వాములు కావాలని, తెలంగాణకు బ్రాండ్ అంబాసడర్లుగా నిలవాలని టూరిజం, ట్రావెల్స్, హస్పిటాలిటీ ఎగ్జిబిటర్లు, ప్రతినిధులకు మంత్రి పిలుపునిచ్చారు.

అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ జి. ముకుంద రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అక్టోబర్ 2న లంగర్ హౌస్ బాపూఘాట్‌లో నిర్వహించే గాంధీ జయంతి వేడుకల నిర్వహణపై ఏర్పాటుచేసిన సమావేశంలో సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకల్లో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రివర్యులు, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అలాగే ఉన్నతాధికారులు బాపూ ఘాట్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పిస్తారని తదుపరి మ్యూజియంను తిలకిస్తారని అన్నారు. శాఖల వారీగా చేపట్టే ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో కలిసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని ఆయన సూచించారు. వేడుకలో నిరంతర విద్యుత్, పారిశుధ్య పనులు, త్రాగునీటి ఏర్పాటు, భారీ కేటింగ్, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పూలతో చేపట్టే సుందరీకరణ పనులు, మెడికల్ స్టాల్స్‌తో పాటు అంబులెన్స్ ఏర్పాటు, సౌండ్ ప్రూఫ్ జనరేటర్లు ఏర్పాటు, మీడియా పాయింట్, సౌండ్ సిస్టం ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, వాటర్ ప్రూఫ్ షామియానాల ఏర్పాటు అలాగే ప్రోటోకాల్ అంశాలపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. డీఎంహెచ్ఓ డా. వెంకటి, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫియాజ్, విద్యుత్, ఉద్యాన, జిహెచ్ఎంసి, ఆర్ అండ్ బి, ఫైర్, పోలీస్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు వారసత్వ సంరక్షణ ప్రాజెక్టుల శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : వారసత్వ కట్టడాల పునరుద్ధరణ, సంరక్షణ కు శిక్షణ దోహదం చేస్తుందనీ జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, ఆర్ అండ్ బి ఇంజనీర్ లకు రెండు రోజులపాటు వారసత్వ సంరక్షణ ప్రాజెక్టుల శిక్షణ కార్యక్రమంను ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సహకారంతో జీహెచ్ఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. హైదరాబాద్ ఇన్‌టాక్ కో కన్వీనర్ సజ్జాద్ షాహిద్ హైదరాబాద్ వారసత్వ నిర్మాణాలు, సంరక్షణ సూత్రాలు, నిర్మాణాల మరమ్మత్తులు, ప్రత్యేక పదార్థాల వినియోగం వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఇంజనీర్లకు వారసత్వ సంరక్షణపై ప్రత్యేక శిక్షణ అవసరమని, ఆన్ గ్రౌండ్‌లో వారసత్వ కట్టడాల పునరుద్ధరణ పనులను అమలు చేసే కీలక పాత్ర ఇంజనీర్లదేనని, ఈ నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ దోహదం చేస్తుందనీ అన్నారు. క్యూక్యూఎస్‌యూడిఏ వారసత్వ ప్రాజెక్టులకు నోడల్ ఏజెన్సీగా పనిచేస్తూ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో పురాతన కట్టడాల పునరుద్ధరణ, పరిరక్షణకు ఆగాఖాన్ ట్రస్ట్ సహకారం ఎనలేనిదని కొనియాడారు. శిక్షణలో నిపుణులు ఏకేటిసి ఇండియా సీఈఓ రతీష్ నందా, కన్సర్వేషన్ కన్సల్టెంట్ డా. బెన్నీ కురియకోస్, కన్సర్వేషన్ ఆర్కిటెక్ట్ ఉజ్వల మీనన్ పాల్గొని ప్రసంగించారు. క్యూ క్యూ ఎస్ యు డి చీఫ్ ఇంజనీర్ బి గోపాల్, ఈఈ మహమ్మద్ వాహజుద్దిన్ లు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారులతో కార్పోరేటర్ పర్యటన

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని దుర్గా నగర్, దొడ్ల బస్తీలో వర్షానికి జలమయమైన ప్రాంతాలలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, ఈ ఈ లక్ష్మణ్, డి.ఈ.ఈ లౌక్య, ఏ.ఈ.ఈ సత్యలక్ష్మి అధికారులతో కలిసి స్థానికుల పిలుపు మేరకు ముంపు ఏరియాలలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, సమస్య పరిష్కరించాలని కోరారు. వర్షం వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు అవు తున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ,రత్న భూషణరావు, కిషోర్, రామకృష్ణ,చారి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సహజ సిద్ధమైన ఆహారంతోనే ఆరోగ్యం

లయోలా అకాడమీ మిల్లెట్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : అల్వాల్‌లోని లయోలా అకాడమీలో నిర్వహించిన మిల్లెట్ ఫెస్టివల్‌కు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌కు చెందిన సైంటిస్టులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం మిల్లెట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి, ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన మిల్లెట్ వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మిల్లెట్లు అధిక పోషక విలువలతో ఆకలి తీర్చడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుతాయని చెప్పారు. ఒకప్పుడు అనాగరిక, ఆటవిక ఆహారంగా పరిగణించిన మిల్లెట్లు నేడు స్టార్ హోటల్స్‌లో లభించడం గర్వకారణమని తెలిపారు. ఈ తరం మిల్లెట్ ఆహారాన్ని తప్పనిసరిగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తాను మిల్లెట్ ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి వ్యాధులు రాలేదని, రాజకీయ ఒత్తిడుల వల్లే బీపీ, షుగర్ సమస్యలు వచ్చాయని, వాటి కోసం తప్ప దేనికి మందులు మాత్రలు తీసుకోనని వ్యాఖ్యానించారు. ఆదివాసి సమాజం సహజ సిద్ధమైన ఆహారం, స్వంత జ్ఞానంతోనే బతుకుతుందని, తాను ఎప్పుడూ శారీరక శ్రమకు వెనకాడనందువల్లే కరోనా సమయంలో వందరోజులు సేవలు చేసినా తనకు ఏ సమస్య రాలేదని ఆమె గుర్తు చేశారు. అమ్మాయిలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, కష్టపడి చదువుకొని తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలని సూచించారు. విద్య ద్వారానే గౌరవం లభిస్తుందని, వివక్ష లేకుండా అన్ని రంగాల్లో అమ్మాయిలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కష్టపడి ప్రయత్నిస్తే విజయాలు సాధ్యమవుతాయని, తానే దానికి ప్రత్యక్ష ఉదాహరణనని ఆమె విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ములుగులో ఓటమిని ఎదుర్కొన్నా తరువాతి ఎన్నికల్లో విజయం సాధించి నేడు మంత్రిగా సేవలందిస్తున్నానని ఆమె గుర్తు చేశారు. “మనుషులు శాశ్వతం కాదు, కానీ మనం చేసే మంచి పనులే శాశ్వతం. కాబట్టి శ్రమను, ఎదుటివారిని గౌరవించాలి” అని విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యాసంస్థలు, విద్యార్థులు ఆదివాసి గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమై సమాజాన్ని అధ్యయనం చేయాలని మంత్రి సీతక్క సూచించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి

విశాలాంధ్ర-దుండిగల్: మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాజీవ్ గృహకల్పలో నల్ల మల్లీస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం నందు రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకం దిగ్విజయంగా నడుస్తుందని వ్యక్తం చేశారు.ప్రధానంగా 11 ఏళ్ల పాటు నూతన రేషన్ కార్డు లు లేక ఎదురుచూసిన లక్షలాది మందికి కాంగ్రెస్ ప్రభుత్వం నూతన తెల్ల రేషన్ కార్డులను అందించిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పేద ప్రజల నివాసానికి ఇందిరమ్మ ఇండ్లు, పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం, పేద ప్రజలు వాడుకుంటున్న 200 యూనిట్ల లోపు విద్యుత్తు బిల్లుల మాఫీ,సెల్ఫ్ హెల్ప్ మహిళా గ్రూపులకు వడ్డీ లేని 21 వేల కోట్ల నిధుల మంజూరి, మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ తదితర కార్యక్రమాలతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి విశేష కృషి సలుపుతుందని తెలిపారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు, పేద వర్గాల వారికి కాంగ్రెస్ పార్టీ విశేష ప్రాధాన్యతనిస్తూ, వారి సంక్షేమానికి పాటుపడుతుందని వివరించారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలకు నల్లమల్లి ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానిక రాజీవ్ గృహకల్ప వాసులు, పెద్ద సంఖ్యలో మహిళలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కొలను రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నల్లమల్లి ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్ పర్సన్ సామ్రాజ్యలక్ష్మి, సరిత,శ్రీదేవి, అరుణ,రాధిక, అనంతలక్ష్మి, స్రవంతి, శశికళ, పల్లా శశికళ, పద్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తు న్న పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికుల వేతనా లకు సంబంధించిన ఆరు నెలల పెండింగ్ జీతాల బడ్జెట్ తక్షణమే విడుదల చేసి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి కార్మికులు సంతోషం గా దసరా బతుకమ్మ పండుగ జరుపుకునే విధం గా చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ విజ్ఞప్తి చేశారు. శుక్ర వారం జడ్చర్ల ఏరియా ఆసుపత్రి బాలానగర్ సిహెచ్‌సి కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరిండెంట్, జిల్లా వైద్య సమన్వయ అధికారి డాక్టర్ చంద్రకళకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించకుండా నెలల తరబడి పెండింగ్లో ఉంచడం చేత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుండి వేతన బడ్జెట్ విడుదల కాకపోవడం చేత సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్లు రెండు మూడు నెలలు వేతనాలు చెల్లించి చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో కొలిచే దసరా బతుకమ్మ పెత్తర అమావాస్య పర్వదినం సమీపిస్తుండటంతో వేతనాలు రాక తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. అధికారులు మానవత దృక్పథంతో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుండి బడ్జెట్ విడుదల కాకపోయినా ఏజెన్సీలను ఒప్పించి కార్మికులకు పెండింగ్ వేతనాలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. లేనిచో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని అన్నారు. ఆసుపత్రి బ్రాంచ్ ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ నేతలు కార్మికులు కె.నరసింహ, నవీన్, అంజి,పేర్మల్, రామకృష్ణ, మణెమ్మ, శివలీల, పద్మ, అలివేలమ్మ, భార్గవి, నీరజ, చెన్నమ్మ, నరసమ్మ, అంజలి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో వాస్తవం లేదు

టీజీఎస్ఆర్టీసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : పండుగుల నేపథ్యంలో బస్సు టికెట్ చార్జీలను పెంచినట్లు జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండించింది. టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. ప్రధాన పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే సర్వీసులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరిస్తుందని పేర్కొంది. స్పెషల్ బస్సుల్లో మాత్రమే సాధారణ చార్జీలో 50 శాతం వరకు సవరణ అమల్లో ఉంటుందని వివరించింది. టీజీఎస్ఆర్టీసీలో 2003 నుంచి ఈ పద్ధతి ఆనవాయితీగా వస్తోందని, ఇప్పుడే స్పెషల్ బస్సుల్లో కొత్తగా చార్జీలను సవరణ చేస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికింది. ప్రధాన పండుగులైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారు. ఈ సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నడుపుతుంది. రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో ఖాళీగా ఆ బస్సులు వెళ్తుంటాయి. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 50 శాతం వరకు టికెట్ ధరను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. టీజీఎస్ ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల వరకు బస్సులు సేవలందిస్తున్నాయి. పండుగ సమయాల్లో రద్దీకి అనుగుణంగా ప్రతి రోజు సగటున 500 నుంచి 1000 వరకు స్పెషల్ బస్సులను మాత్రమే సంస్థ నడుపుతుంది. ఆ స్పెషల్ బస్సుల్లో మాత్రమే జీవో ప్రకారం చార్జీల సవరణ ఉంటుంది. మిగతా రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఇప్పుడు కూడా స్పెషల్ బస్సులను సంస్థ నడుపుతోంది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే చార్జీల సవరణను సంస్థ చేయనుంది. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. పండుగల సమయాల్లో నడిచే అన్ని బస్సుల్లోనూ చార్జీలను సవరించారని కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేస్తోంది.

భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి రాచకొండ పోలీస్ కమీషనరేట్ నేరెడ్ మెట్‌లో శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్ బాబు చేతుల మీదుగా పోలీస్ సేవా పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా సేవా పతకాలను అందుకున్న వారిని సిపి అభినందించారు. అనంతరం వారితో మాట్లాడుతూ విధి నిర్వహణలో అసామాన్యమైన ప్రతిభను కనబరిచిన పోలీస్ సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవా పతకాల ద్వారా గుర్తిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం 2025, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పథకాలు వచ్చిన వారికి ఉత్తమ సేవ పథకాలు అందజేయడం జరిగింది. అందులో భాగంగా రాచకొండ కమీషనరేట్ పరిధిలో 65 మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందచేశామన్నారు. వీరిలో కానిస్టేబుల్ నుంచి అడిషనల్ డీసీపీ ర్యాంక్ వరకు ఉన్నారన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించడం, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎటువంటి రిమార్కులు లేకుండా పతకాలు స్వీకరించడం ఆనందదాయకమని, ఇదే స్ఫూర్తితో విధుల పట్ల అంకితభావం, మంచి ప్రతిభ కనబరిచి, ప్రజలకు పోలీసు వారి సేవలను అందించాలని, అదే విధంగా పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా విధులు నిర్వహించాలని సీపీ తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా బాగా పని చేసి ప్రజలకు మెరుగైనా సేవలు అందించి ప్రభుత్వము నుంచి మరిన్ని పతకాలు సాధించాలన్నారు. అలాగే ఇతర సిబ్బంది కూడా పతకాలను అందుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా పతకాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం భువనగిరి ఏసిపిగా పని చేస్తున్న రాహుల్ రెడ్డికి అడిషనల్ ఎస్పీ ప్రమోషన్ రావడంతో సిపి అతన్ని అభినందించారు. డిసిపి మల్కాజిగిరి పద్మజ, ఎల్బి నగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, ఎస్ఓటి డీసీపీ రమణ రెడ్డి, ఎస్.బి. డీసీపీ జి.నరసింహ రెడ్డి, ట్రాఫిక్ ట్రాఫిక్ డీసీపీ - 1 మనోహర్, ట్రాఫిక్ డీసీపీ-2 శ్రీనివాసులు, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, డీసీపీ హెడ్ క్వార్టర్ శ్యాంసుందర్, అడిషనల్ డీసీపీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

టైమ్స్ హాస్పిటల్ పనులు త్వరగా పూర్తి చేయాలి : మంత్రి దామోదర

విశాలాంధ్ర - హైదరాబాద్ : సనత్‌నగర్ టిమ్స్ పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హాస్పిటల్ ప్రారంభించిన రోజు నుండే ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా అవసరమైన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ అన్నీ ముందే సమకూర్చుకోవాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని నియమించుకోవాలని డీఎంఈ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట్ టిమ్స్ హాస్పిటళ్లు, నిమ్స్ హాస్పిటల్ విస్తరణ ప్రాజెక్ట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీల నిర్మాణ పనులపై సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సనత్‌నగర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ల పనులు మరో 6 నెలల్లో పూర్తి అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరిలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి గుర్తు చేశారు. అక్టోబర్ చివరి నాటికల్లా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆలస్యం కావొద్దన్నారు. ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోలు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్స్ అన్నీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడినవే కొనుగోలు చేయాలని సూచించారు. సంబంధిత డిపార్ట్‌మెంట్ డాక్టర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్టు పనులపై మంత్రి ఆరా తీశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్‌కు హాస్టల్ సదుపాయం కూడా అక్కడే ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహబూబాబాద్, మంచిర్యాల్, జనగాం, వనపర్తి మెడికల్ కాలేజీ భవనాలను మరో 2 నెలల్లో అప్పగిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. మరో 8 నెలల్లో మిగిలిన కాలేజీల పనులను పూర్తి చేస్తామని తెలిపారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, ఆర్అండ్‌బీ సీఈలు రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, ఇతర అధికారులు, ఆయా భవనాలు నిర్మిస్తున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మేడ్చల్ జిల్లాలో శుక్రవారం ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ అసోసియేషన్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ తెలంగాణ జిల్లా కమిటీ సమావేశ మల్కాజిగిరి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దీనిలో జిల్లా అధ్యక్షులుగా టి. కవిత, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్ చారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : పుట్టపర్తి సత్యసాయి శత జయంతిని పురస్కరించుకొని గౌతం నగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌లో సత్యసాయి సేవా సమితి మహిళ విభాగం మల్కాజిగిరి శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న అనాధ విద్యార్థులకు విద్యాజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం చేపట్టి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, సేవాసమితి సభ్యులు విజయలక్ష్మి, మనోరమ, గంగాధర్, ఏ.వీ స్వామి, శంకర్‌రావు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇనోర్బిట్ మాల్‌లో లైఫ్ స్టైల్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలో అత్యంత ఇష్టమైన ఫ్యాషన్ ప్రపంచానికి పేరొందిన వాటిలో ఒకటైన లైఫ్‌స్టైల్, హైదరాబాద్‌లోని ఇనోర్బిట్ మాల్‌లో కొత్తగా పునరుద్ధరించబడిన తన స్టోర్‌ను ఆవిష్కరించింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో నటి పూజా హెగ్డే దుస్తులు, జోళ్లు, హ్యాండ్ బ్యాగులు మొదలైన అన్ని విభాగాలలో లైఫ్‌స్టైల్ ప్రత్యేకమైన దసరా కలెక్షన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ అయ్యర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఇనోర్బిట్ మాల్‌లో కొత్తగా పునరుద్ధరించబడిన మా స్టోర్‌లో లైఫ్‌స్టైల్ కొత్త దసరా కలెక్షన్ ప్రదర్శించడం మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కలెక్షన్ సాంప్రదాయ శోభను ఈ కాలపు స్టైల్తో కలిసిపోయేలా చేసి, నేటి ఫ్యాషన్ పట్ల స్పృహ ఉన్న దుకాణదారులను ఆకర్షించడానికి రూపొందించబడిందని పేర్కొన్నారు. ఈ స్టోర్ లైఫ్‌స్టైల్ కొత్త గుర్తింపును సూచిస్తుందని, ఇక్కడ డిజైన్, అనుభవం కలగలిసి ఒక శక్తివంతమైన రిటైల్ గమ్యస్థానాన్ని సృష్టిస్తాయన్నారు. కస్టమర్లు క్యూరేటెడ్ ప్రోడక్ట్ కేటగిరీలు, మెరుగైన లేఅవుట్స్, షాపింగును సజావుగా స్ఫూర్తిదాయకంగా మార్చే ఉత్సాహభరితమైన వాతావరణం కోసం ఎదురు చూడవచ్చన్నారు.

గడ్డం రంజిత్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల బాగోగులు చూసుకుంటూ, ఎన్నో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు రంజిత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆమె మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మధు, గాయత్రి, శ్రీనివాస్ గౌడ్, పద్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు బాధల నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తాం: మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : షేక్‌పేట్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వరద ముంపు బాధల నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాది, భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం సాయంత్రం షేక్‌పేట్ డివిజన్ విరాట్ నగర్, మిని బృందా వనం, హకీమ్ కాలనీలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపుకు గురైన ప్రభావిత ప్రాంతాలను మంత్రి, మేయర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాధిత ప్రజలతో మాట్లాడారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ మాట్లాడుతూ ప్రజలు ధైర్యంగా ఉండాలని ముంపు బాధిత ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. శాశ్వత పరిష్కారం కోసం త్వరగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి, మేయర్ అధికారులకి ఆదేశించారు.

ఘనంగా సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ

విశాలాంధ్ర - హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్, బుక్ హౌస్ ఆధ్వర్యంలో, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, బుక్ హౌస్ పూర్వ ఉద్యోగుల సహకారంతో, సిపిఐ మాజి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు, విశాలాంధ్రకు దీర్ఘకాలం సేవలందించిన సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ శుక్రవారం విజ్ఞాన్ భవన్, నవచేతన బుక్ హౌస్, బ్యాంక్ స్ట్రీట్, అబిడ్స్, హైదరాబాద్‌లో విజయవంతంగా జరిగింది. ఈ సభలో నవచేతన పబ్లిషింగ్ హౌస్, బుక్ హౌస్ ఉద్యోగులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, బుక్ హౌస్ పూర్వ ఉద్యోగులు పాల్గొని, సుధాకర్ రెడ్డి వ్యక్తిత్వం, ప్రజా ఉద్యమాలలో ఆయన పోషించిన కీలకపాత్రను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బీఎస్ఆర్ మోహన్ రెడ్డి ప్రసంగిస్తూ సుధాకర్ రెడ్డికి విశాలాంధ్ర రచనలతో ఉన్న అనుబంధాన్ని, అలాగే విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌తో ఆయనకున్న ఆత్మీయ సంబంధాలను వివరించారు. సభలో పూర్వ ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. సుధాకర్ రెడ్డి ప్రజలతో కలిసిపోయే సాదాసీదా జీవన శైలి, కష్టనష్టాలను పట్టించుకోని పోరాట పటిమతో ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని వారు తెలిపారు. సంస్మరణ సభకు పూర్వ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి. రాజేశ్వరరావు, మాజీ అసిస్టెంట్ మేనేజర్ ఎస్. రాజా, అరసం తెలంగాణ శాఖ కార్యదర్శి రాపోలు సుదర్శన్, బొమ్మగాని నాగభూషణం, విశాలాంధ్ర, జైకో పబ్లిషింగ్ హౌస్, తెలంగాణ పబ్లికేషన్స్, తెలుగు బుక్ హౌస్, ఇతర ప్రచురణ సంస్థల ప్రతినిధులు పాల్గొని నివాళులు అర్పించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు కూన శ్రీశైలం గౌడ్‌కి ఆహ్వానం

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సూరారం శ్రీ కట్టమైసమ్మ, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం సభ్యులు షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని శుక్రవారం తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని కోరారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శశాంక్, ఈవో కృష్ణమాచార్యులు, మాజీ కౌన్సిలర్ జయరాం, ఆరిఫ్, శంకర్, గంగారం, శ్రీనివాస్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలి వెళ్లిన గిరిజన నాయకులు

విశాలాంధ్ర-కొత్తూరు: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ సభకు ఎల్ హెచ్ పి ఎస్ కొత్తూరు మండల అధ్యక్షుడు బాబురావ్ నాయక్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కొత్తూరు వై జంగ్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి షాద్నగర్ నియోజక వర్గ గిరిజన నాయకులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగ నివాళులు అర్పించారు. లంబాడీల హక్కుల సాధనకోసం కలిసి కట్టుగ పోరాడాలని పిలుపునిచ్చారు. ఎల్ హెచ్ పి ఎస్ ప్రధాన కార్యదర్శి మోహన్ నాయక్, నాయకులు మోతిలాల్ నాయక్, సోమ్లా నాయక్, జగన్ నాయక్, రవి నాయక్, వెంకటేష్ నాయక్, యూత్ విభాగం అధ్యక్షులు సంజీవ్ నాయక్, మున్సిపల్ అధ్యక్షుడు చంద్ర నాయక్, కేశంపేట్ అధ్యక్షులు రాజు నాయక్, కొందుర్గు అధ్యక్షులు గోపాల్ నాయక్, షాద్నగర్ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అయోధ్య శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పరుశరామ్ నాయక్, ఉపాధ్యక్షులు రాజేష్ నాయక్, పవన్ నాయక్, వినోద్ నాయక్, వల్య నాయక్, సంతోష్ నాయక్. శంకర్ నాయక్, వెంకటేష్ నాయక్ నగేష్ నాయక్, వినోద్ నాయక్ పాల్గొన్నారు.

భక్తిభావంతోనే ప్రశాంతత సాధ్యం

విశాలాంధ్ర - మొయినాబాద్ : దేవాలయాలను అభివృద్ధి చేసుకున్నప్పుడే భక్తిభావనతో ప్రజలలో మన శాంతి, ప్రశాంతత నెలకొంటుందని మొయినాబాద్ మండల మండల ఎంపీటీసీల ఫోరం తాజా మాజీ అధ్యక్షుడు, రెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ, మైసమ్మ, నాగులమ్మ దేవాలయాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోచమ్మ దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..రెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాల నిర్మాణానికి అందరం కృషి చేసుకుందామని పేర్కొన్నారు. అందరూ సహకరించుకుంటూ దేవాల యాల నిర్మాణాలను అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. సుదర్శ న్రెడ్డి, యాదగిరి, సత్తిరెడ్డి, రాంచందర్, నర్సింహులు పాల్గొన్నారు.

నూతన పథకాలను ప్రారంభించిన మంత్రి అడ్లూరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేసింది. శుక్రవారం సచివాలయంలో రెండు కొత్త పథకాలను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లాంచనంగా ప్రారంభించారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన", "రేవంతన్నా కా సహారా - మిస్కీన్‌ల కోసం" పేరుతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రక్రియకు సంబంధించిన పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ రెండు పథకాలను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ రెండు పథకాలు మైనారిటీల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాయి. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయి" అని వెల్లడించారు. వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, అవివాహిత మహిళలు చిన్న వ్యాపారాలు మొదలుపెట్టి స్వయం ఉపాధి పొందేలా ఇందిరమ్మ యోజన తోడ్పడుతుంది" అని తెలిపారు. ఫకీర్, దుదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాలు ఇవ్వడం వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తుంది" అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చి వెంటనే అమలు చేసే నాయకుడు. ఆయన దూరదృష్టి వల్లే ఈ పథకాలు వెలువడ్డాయి" అని పేర్కొన్నారు. ఈ రెండు పథకాలకే ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించడం మైనారిటీల పట్ల అంకితభావానికి నిదర్శనం" అని తెల్పారు. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు పూర్తి అయిన కొద్ది రోజుల్లోనే ఇలాంటి కొత్త పథకాలు ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నానని" చెప్పారు. లబ్ధిదారులు ఈ సాయాన్ని కుటుంబాభివృద్ధికి వినియోగించుకోవాలనీ సూచించారు. మైనారిటీల అభివృద్ధి అంటే కేవలం సబ్సిడీలు కాదు, వారిని స్వయం ఉపాధికి దారి చూపడం మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. ఈ పథకాలు కుటుంబ పోషణకు తోడ్పడటమే కాకుండా, మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచుతాయి" అని అన్నారు. చిన్న వ్యాపారాల ద్వారా సంపాదన పెరిగితే, వారిలోని యువతకు చదువులోనూ, ఉపాధిలోనూ మెరుగైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, గ్రంథాలయాల చైర్మన్ డా. రియాజ్, కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మనలా మోహన్ రెడ్డి, రిజీఎంఎఫ్ సి. వీసీ, ఎం.డి కాంతి వెస్లీ, షఫియుల్లా, ఏజీఎం.కె. పెర్సిస్, ప్రవీణ్ కులకర్ణి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దుర్గాబాయ్ మహిళా శిశువికాస కేంద్రం మహిళా ప్రాంగణంలో మహిళా ట్రైనింగ్ సెంటర్‌ను మంత్రి డా దానసరి అనసూయ సీతక్క తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, మహిళా సంక్షేమ శాఖ సెక్రటరీ సీతారామచంద్రన్, ఉమెన్ కార్పొరేషన్ ఎండి చంద్రకాంత్ రెడ్డి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పాల్గొని గౌరవ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ "మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న ఐటీ కంపెనీల సిఎస్ఆర్ నిధులను మహిళా శిక్షణ కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే అవకాశాన్ని దుర్గాబాయ్ మహిళ శిశు వికాస కేంద్రం మహిళా ప్రాంగణానికి అప్పగిస్తాం" అని తెలియచేసారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "ప్రతి మహిళ మహారాణి కావాలంటే ఆర్థిక స్వావలంబన అవసరం. చేతిలో డబ్బు ఉన్నప్పుడే మహిళలకు స్వేచ్ఛ, గౌరవం లభిస్తుంది. కుటుంబాభివృద్ధి, పిల్లలకు మంచి విద్య అందించాలంటే మహిళలు ఆర్థికంగా బలపడాలి" అన్నారు. కూకట్పల్లి మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణతో పాటు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల గ్రీన్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించిన ఆమె, టు వీలర్, త్రీ వీలర్ ట్రైనింగ్ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పూర్తయ్యాక వడ్డీ లేని రుణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఉచిత శిక్షణ సౌకర్యాలు అందిస్తున్నందుకు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

చెల్లెలిని బయటకు పంపిన చరిత్ర కేటీఆర్‌ది

విశాలాంధ్ర - హైదరాబాద్ : సొంత చెల్లెలిని బయటకు పంపిన చరిత్ర కేటీఆర్ దని అలాంటి కేటీఆర్ అడబిడ్డల గురించి సుద్దపూస లాగ మాట్లాడుతున్నాడని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అన్నారు. బతుకమ్మ పై బీఆరెస్ పాట రాసినందుకు థాంక్స్ అని వారే మా పథకాలు ఎన్ని అమలు చేస్తున్నామో ప్రజలకు చెప్పారని తెలిపారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాట రిలీజ్ చేసే ముందు ఆడబిడ్డల ను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. ఆడ బిడ్డలను గౌరవించని చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిదని మండిపడ్డారు. బతుకమ్మ కుంటను ఆక్రమించింది మీరు కాదా అని నిలదీశారు. కానీ మేము బతుకమ్మ కుంటను అభివృద్ధి చేశామని, కానీ వాళ్ళు హైడ్రా మీద ఎడుస్తున్నారు, అదే హైడ్రా బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. ఐదేండ్లలో ఒక్క మహిళ మంత్రి లేని క్యాబినెట్ మీదని, లక్షల కోట్ల కుంభకోణం చేసిన మీరు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే కేటీఆర్, కవిత కు అర్హత లేదని విమర్శించారు. బీఆరెస్ దోసుకున్నారని కవిత స్వయంగా చెప్పిందని, బతుకమ్మ పేరుతో కవిత వందల కోట్లు దోచుకుందని ఆరోపించారు. బీఆరెస్‌కు చెంపపెట్టులాగా బతుకమ్మ పండుగ జరుపుతామని, ముందు ఆ పార్టీ నాయకులు మహిళలను గౌరవించడం నేర్చుకోవ్వాలన్నారు. ఒళ్ళు దగ్గర బెట్టుకొని మాట్లాడకపోతే ఎన్నికల్లో మహిళలం డిపాజిట్లు రాకుండా చేస్తామని అన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కాప్రా : నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని తోటి విద్యార్థులు చిత్రహింసలు పెట్టి బర్త్ డే బంప్స్ పేరిట ప్రయివేటు పార్ట్స్ పై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంకు ధన దోపిడీపై ఉన్న శ్రద్ధ... విద్యార్థుల భద్రతపై లేకపోవడం సిగ్గుచేటని నిరసిస్తూ, దాడి ఘటనపై పోలీసులు, విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న బాలుడు గత నెల ఆగస్టు 29న బాలుడు పుట్టిన రోజు సందర్భంగా ప్రతి రోజు మాదిరిగానే 29న కూడా స్కూల్ కి వెళ్లినట్లు విద్యార్థి తల్లిదండ్రులు పన్నాల సునీత, బోర్రా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్కూల్లో మధ్యాహ్న సమయంలో తమ కుమారుడు రిశాంత్ రెడ్డి స్నేహితులు బర్త్డే బంప్స్ అనుకుంటూ ఇష్టం వచ్చినట్టు కొట్టి, తన్ని, మర్మాంగాలపై మోకాలితో తన్నడంతో తీవ్ర నొప్పితో తమ కుమారుడు కింద పడిపోయినట్టు తెలిపారు. తమ కుమారుడి మర్మాంగాల నుండి రక్తం కారడంతో నొప్పి అని క్లాస్ రూంలో జరిగిన విషయాన్ని వైస్ ప్రిన్సిపల్ కు తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయాన్ని గమనించిన ఇన్చార్జి, వైస్ ప్రిన్సిపాల్ ఆలస్యంగా ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాలుడిని పరీక్షించిన డాక్టర్లు వేరే ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం విద్యార్థి వృషణం దెబ్బతిన్నట్టుగా నిర్ధారించి, శస్త్ర చికిత్స కోసం బంజారా హిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి పంపినట్టు తెలిపారు. కానీ తమ బాలుడి విషయంలో స్కూల్ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని వారిపై చర్యలు తీసుకోవాలని నాచారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం చైర్మన్, సంబంధిత సెక్షన్ ఆఫీసర్, విద్యార్థిని గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుండి కేవలం ధనార్జన వసూళ్ల ధ్యేయంగా వ్యవహరిస్తోందే తప్ప, సమాజం,విలువలు, క్రమశిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లనే ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం,ఈ ఘటనపై పోలీసులను తప్పుద్రోవ పట్టించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మల్క కొమురయ్య పై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బాధిత విద్యార్థి వైద్య ఖర్చులు యాజమాన్యమే భరించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, రాకేష్ ,ప్రభు, శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, అజీమ్ పాషా, సమీర్, సోను, షాబాజ్, ఇర్ఫాన్, రాజేష్,విజయకుమార్, ఆకాష్, అజయ్, స్వాజిత్, జీవన్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు మల్లికార్జున్‌కు పరామర్శ

విశాలాంధ్ర - షాద్ నగర్ రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన జర్నలిస్ట్ మల్లికార్జున్ సీమై టీవీ రిపోర్టర్ గాయపడ్డాడు. విధుల్లో భాగంగా షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా చేతికి గాయమైంది. దీంతో ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను సంప్రదించగా చేయి ఎముక విరిగినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు డాక్టర్ ఆనంద్ ఎముకకు శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు మల్లికార్జున్‌ను షాద్‌నగర్‌కు చెందిన జర్నలిస్టులు సలీమ్, ఇలియాజ్ ప్రవీణ్, పరామర్శించి ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛ భారత్ ప్రతి పౌరుడి బాధ్యత

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్ రాందీన్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మీన లాల్ సింగ్ అధ్యక్షతన గోపనపల్లి తండాలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పరిసరాలను శుభ్రపరిచి, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ క్లీన్ ఇండియాను సాధించాలన్న సత్సంకల్పంతో భారత ప్రధాని నరేంద్ర మోదీ 2014 అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ మిషన్కు శ్రీకారం చుట్టారని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో గుర్తుచేశారు. బహిరంగ మలవిసర్జనను అరికట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఈ మహా ప్రస్థానం కొనసాగిందని తెలిపారు.

గ్లో బై కీర్తిలాల్స్‌కి అవార్డ్

విశాలాంధ్ర - హైదరాబాద్: జెన్ జీ, మిలీనియల్స్ అనుదిన విలాసవంతమైన తీరుని పునర్నిర్వచిస్తున్న వజ్రాభరణాల బ్రాండ్ అయిన గ్లో బై కీర్తిలాల్స్ పరిశ్రమలో తన తొలి అవార్డుని గెలుచుకుంది. ఈ మేరకు ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అవార్డు ప్రధానోత్సవ వేడుకలో వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డాక్టర్ ఆర్.అరుణా నందన్ చేతుల మీదుగా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ అందుకున్నారు. ఈ అవార్డు గెలుచుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన రిటైల్ జ్యువెలర్స్ గిల్డ్ అవార్డ్స్ 2025లో, "ఎక్సలెన్స్ ఇన్ డిజైన్ కలర్ స్టోన్ ఇయర్ రింగ్స్"గాను గుర్తింపు పొందన్నారు. హస్తకళా పనితనాన్ని మూలంగా చేసుకుంటూనే సమకాలీన శైలిలో సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందని చెప్పారు. భారతీయ ఆభరణాల పరిశ్రమ రంగంలో సృజనాత్మకతని, ఆవిష్కరణని వేడుకచేసుకుంటూ "మనసుపెట్టి చేసిన రూపకల్పనలు, వివరంగా తీర్చి దిద్దడాలు ఎప్పుడూ కాంతులీనుతాయనడానికి ఈ అవార్డే నిదర్శనం అన్నారు. కొత్తతరం ఆభరణాల ప్రేమికులకోసమే గ్లో బై కీర్తిలాల్స్ రూపుదాల్చిందన్నారు. పరిమితులని అధిగమిస్తూ వుండడానికి, వజ్రాలని మరింత ఉత్సాహభరితంగా, ఆధునికంగా, అర్థవంతంగా చేయడానికి ఈ గుర్తింపు మమ్మల్ని వెన్ను తట్టి ప్రోత్సహిస్తుందని చెప్పారు. గ్లో కు సంబంధించి, ఈ తొలి గెలుపు, అవార్డుకన్నా మించినదని, వజ్రాల మంచి రూపకల్పనలు, చక్కటి రంగులు, యవ్వనోత్సాహం కలగలిపి రూపుదిద్దే ట్రెండ్సెట్టర్ గా ఈ బ్రాండ్ ప్రభావశీలి అవుతోందనడానికి ఇదొక సంకేతం అన్నారు. గ్లో బై కీర్తిలాల్స్ షోరూంలు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చి, త్రిస్సూర్, ఈరోడ్, తిరుపూర్‌లో వున్నాయని, ఆన్‌లైన్లో డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు డాట్ గ్లో జువెల్స్ డాట్ కామ్‌లో పూర్తి సేకరణలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల పైనే వుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్ నగర్ ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఫరూఖ్ నగర్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, వారు భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు.విద్యారంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్ నగర్ మండల విద్యాధికారి మనోహర్, ఎంపీడీఓ బన్సీ లాల్, మాజీ జడ్పీటీసీ వెంకట్ రాం రెడ్డి, కృష్ణా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజు, అన్వర్, ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: దసరా పండుగ ముందే మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పండుగ బతుకమ్మ, దసరా కనుక ప్రతి నెలల కాకుండా తొందరగా వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణాలో బతుకమ్మ, దసరా పండుగలకు ప్రాధాన్యత ఉందని, తెలంగాణ గడ్డ పై ఈ పండుగలు ముఖ్యంగా పేదలు, కార్మికులు జరుపుకుంటరని వ్యక్తం చేశారు. మున్సిపాల్లో పని చేసే పర్మినెంట్, ఔటసోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులందరికి 26వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, అదే విధంగా దసరా పండుగ సందర్భంగా వేతనాల సవరణ జరగలేదు కనుక కార్మికవర్గానికి కనీసం తాత్కాలిక భృతి రూ.6000 ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, నూనె డబ్బులు, సబ్బులు, ఇతర పనిముట్లు ఇవ్వాలని, శానిటేషన్ విభాగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనీ, మలేరియా రంగంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం భర్తీ చేయవలసిందిగా మనవి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్ మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: గత 18 నెలలుగా రాష్ట్రంలోని ఎస్టీ హాస్టల్స్‌లో మెస్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. దీంతో హాస్టల్‌లలో వార్డెన్‌లు వడ్డీలకు డబ్బులు తెచ్చి, మెస్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాటి అద్దె బిల్లులు గత 20 నెలలుగా చెల్లించడం లేదని విమర్శించారు. ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయా, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క లను పలుమార్లు కలిసి వినతి పత్రాలను అందజేసిన స్పందించడం లేదన్నారు. బడా కాంట్రాక్టర్లకు వేలాది కోట్లు విడుదల చేస్తున్న ప్రభుత్వానికి... ఎస్టీ హాస్టళ్ల మెస్ చార్జీల బిల్లులు చెల్లించడానికి వంద కోట్లు లేవా అని ఆయన ప్రశ్నించారు. దసరా వరకు రాష్ట్ర ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని, అప్పటివరకు బిల్లులు చెల్లించకపోతే, వేలాది మంది విద్యార్థులతో ప్రజా భవన్ ముట్టడిస్తామని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్నీల వెంకటేష్ మాట్లాడుతూ గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టి సారించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడి మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ నేతలు గుజ్జ కృష్ణ, అనంతయ్య, నంద గోపాల్, శివ కుమార్ యాదవ్, నరేష్ గౌడ్, కిరణ్, రవి యాదవ్, అనంతయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, కులపతి జిష్ణు దేవ్ వర్మ హాజరయ్యారు. అంతకుముందు గవర్నర్‌కు ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2023-2024 సంవత్సరాలలో ఉత్తీర్ణత సాధించిన 524 మంది విద్యార్థులకు డిగ్రీలు, ప్రశంస పత్రాలు ప్రధానం చేశారు. వారిలో 16 మంది పీహెచ్ డి పట్టబద్రులు, 69 మంది మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, 439 మంది బ్యాచ్ లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బండ్రీ, బీటెక్ డైరీ (టెక్నాలజీ), బ్యాచ్ లర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ పట్టబద్రులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు 25 బంగారు పతకాలు, 2 ఉత్తమ ఉపాధ్యాయులకు బంగారు పథకాలు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమం లో నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మీనిష్ షా, రిజిస్టర్ ప్రొఫెసర్ శరత్ చంద్ర, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ కిషన్ కుమార్, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ సతీష్ కుమార్, ప్రొఫెసర్ సత్యనారాయణలు పాల్గొన్నారు.

ఎత్ బార్‌పల్లి గ్రామానికి బస్సు నడిపించాలి



విశాలాంధ్ర - మొయినాబాద్ : మండల పరిధిలోని ఎత్ బార్ పల్లి గ్రామానికి నిత్యం వచ్చే బస్సు రావడం లేదని ఆ గ్రామస్తులు, నాయకులు కలిసి మెహిదిపట్నం డిపో మేనేజర్ కృష్ణమూర్తికి వినతిపత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా మెహిదీపట్నం డిపో కార్యాలయంలో ఎత్బార్ పల్లి గ్రామస్తులు ప్రవీణ్ రెడ్డి, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి వారు డిపో మేనేజర్ తో మాట్లాడుతూ... నెల రోజుల నుంచి మెహిదీపట్నం నుంచి నక్కలపల్లి వెళ్లే బస్సు ఎత్ బార్ పల్లి గ్రామం మీదుగా రావడం లేదని వివరించారు. తోల్కట్ట చౌరస్తా నుంచి నక్కలపల్లి వరకు రోడ్డు రీబీట్లో భాగంగా మరమ్మత్తులు నిర్వహిస్తున్నప్పటికి రోడ్డు పక్కన నుంచి లారీలు, కార్లు, ట్రాక్టర్లు వెళ్తున్నాయని తెలియజేశారు. కానీ మెహిదీపట్నం నుంచి నక్కలపల్లికి వచ్చే ఆర్టీసీ బస్సు ప్రైవేటు బస్సు కావడంతో బస్సు యాజమాన్యం ఈ బస్సును మొయినాబాద్ నుంచి కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లికి నడువుతున్నారన్నారు. దీంతో ఎత్బర్ పల్లి, తోల్కట్ట విద్యార్థులు నిత్యం పాఠశాలలకు వెళ్లే వారు కాలినడకన ప్రయాణిస్తున్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. యధావిధిగా తోల్కట్ట నుంచి నక్కలపల్లి బస్సును నడపాలని డిపో మేనేజర్ కృష్ణమూర్తికి కోరినట్లు ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పట్టవా?

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై విద్యార్థుల ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ధర్నాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి: నాసర్‌జీ
- వైద్య విద్య ప్రైవేటీకరణ ఆపండి: వలరాజు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యాన శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట భారీ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు హాజరు కాగా, విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్నంగా నిర్వహించిన భిక్షాటన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బందల నాసర్‌జీ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వస్తే వంద రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తామని, ఇక నుండి విద్యార్థులకు ఏ కష్టాలు ఉండవని చెప్పిన కూటమి పెద్దలు గద్దె నెక్కిన తర్వాత హామీలు విస్మరించారని మండిపడ్డారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం అమలుపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా కూటమి పాలన కొనసాగుతుందని వారు ధ్వజమెత్తారు. సూపర్ హిట్, సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పడం మినహా విద్యార్థులకు మేలు చేసింది శూన్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రూ.6400 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని విద్యా శాఖా మంత్రిని నిలదీశారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని...ఇదే జరిగితే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు విద్యార్థుల ఆగ్రహానికి గురి కావల్సి వస్తుందని హెచ్చరించారు. ఉన్నత విద్యకు శాపంగా మారిన జీఓ నెం.77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం 107, 108 జీవోలను తెచ్చి నూతన వైద్య కళాశాలలో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను బి, సి కేటగిరీలుగా విభజించిందన్నారు. 'బి' కేటగిరీలో సీటు రూ.12 లక్షలు, 'సి' కేటగిరీలో సీటు రూ.25 లక్షలకు పెట్టిందని చెప్పారు. ఈ జీవోలను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఈ జీవోలను రద్దు చేస్తామని తెలిపారన్నారు. ఈ హామీలను విస్మరించి కొత్తగా పీపీపీ విధానం తీసుకొచ్చి వైద్య కళాశాలలను కార్పొరేట్లకు అప్పగించడం దుర్మార్గమన్నారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని వారు డిమాండు చేశారు. విద్యా రంగ సమస్యలపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందని వలరాజు,నాసర్‌జీ హెచ్చరించారు. ఈకార్యక్రమాల్లో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధానకార్యదర్శి ఈ. కుల్లాయిస్వామి, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేశ్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, ఉపాధ్యక్షులు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో

పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సాయికుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై విజయవాడ ధర్నా చౌక్‌లో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధిక్ బాబు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, సుబ్రహ్మణ్యం, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో

కూటమి ప్రభుత్వం ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. విద్యారంగానికి ఇచ్చిన హామీల అమలు కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో చర్చించి వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి అధ్వర్యంలో స్థానిక హిమానీ సెంటర్, గాంధీ బొమ్మ వద్ద ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అమర్నాథ్, నగర కార్యదర్శి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, వైద్య విద్య ప్రైవేటీకరణ నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలలో భాగంగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నూజివీడు నాయకులు సాయి ప్రసాద్, గోపి, సంతోష్, గణేష్, విష్ణు, చరణ్, శివ శంకర్, రవి, హర్షవర్ధన్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ అధ్వర్యాన కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు ధర్నా చేపట్టారు. కాకినాడ జిల్లా కన్వీనర్ ముమ్మిడి సతీశ్‌బాబు , బన్నీ, సురేశ్, రాజేశ్, శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సీఈసీ పాత్ర అనుమానాస్పదం: ఆప్

న్యూఢిల్లీ: ఓట్లు తొలగించినట్లు చేసిన ఫిర్యాదులను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నిర్లక్ష్యం చేశారని ఆప్ ఆరోపించింది. ఓట్ల చోరీపై కాంగ్రెస్ బాటను అనుసరిస్తూ ఈసీపై విమర్శలు గుప్పించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విలేకరుల సమావేశం నిర్వహించిన మరుసటి రోజు ఆమ్ ఆద్మీ పార్టీ రంగంలోకి దిగి ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెంచింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు న్యూఢిల్లీ నియోజకవర్గంలో 42వేల మంది ఓటర్ల పేర్లను జాబితాలో నుంచి తొలగించినట్లు జనవరిలో ఫిర్యాదు చేస్తే మాజీ సీఈసీ రాజీవ్ కుమార్, ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పట్టించుకోలేదని ఆరోపించింది. ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పటి సీఎం అతిశీ, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ఫిర్యాదులపై చర్యలేమీ పెండింగ్ లేవని ఎన్నికల సంఘం ఈనెల 9న ఆర్టీఐ ద్వారా రిశికేషన్ కుమార్‌కు సమాధానం ఇచ్చిందన్నారు. రాజీవ్‌కుమార్, జ్ఞానేశ్ కుమార్ చర్యలు తీసుకోకపోవడంతో ఈ వ్యవహారంలో వారిపై ఉందా అన్న అనుమానం కలుగుతోందన్నారు. ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు లేకుండానే ఫైళ్లు మూసివేశారన్నారు. సంస్థాగత ముఠా నడుస్తోందని, ప్రజాస్వామ్యం లూటీ సాగుతోందని ఆరోపించారు.

రాహుల్ 'అర్బన్ మావోయిస్టు': ఫడ్నవీస్

ముంబై: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అర్బన్ మావోయిస్టులా మాట్లాడుతున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విషంకక్కారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చేయాలని జెన్‌జీకి పిలుపునిచ్చిన రాహుల్‌కు రాజ్యాంగంపై నమ్మకం లేదని, ఆయన వ్యవస్థలను తిరస్కరిస్తారని విమర్శించారు. ఆయన సలహాల్లో అర్బన్ మావోయిస్టు భావజాలం కనిపిస్తోందని ఫడ్నవీస్ అన్నారు. ఓట్ల దొంగతనం ఆరోపణలతో ఈసీఐపై రాహుల్ తాజా దాడి నేపథ్యంలో జెన్‌జీని ఉద్దేశించిన పోస్టుపై ఫడ్నవీస్ స్పందించారు.

వయనాడ్‌లో సోనియా, రాహుల్

- ప్రియాంక సహా కేరళ నేతలతో భేటీ
- పార్టీలో అంతర్గత సమస్యల వేళ అగ్రనేతల పర్యటనకు ప్రాధాన్యత

తిరువనంతపురం: కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ శుక్రవారం కేరళలోని వయనాడ్‌లో పర్యటించారు. వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీని కలిశారు. ఇది వ్యక్తిగత పర్యటనే అయినప్పటికీ కాంగ్రెస్ కేరళ నాయకత్వం, వయనాడ్ శాఖలో అంతర్గత సమస్యల వేళ అగ్రనేతల రాకకు ప్రాధాన్యత ఏర్పడింది. సోనియా, రాహుల్ కోజికోడ్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వయనాడ్‌లోని పదింజరథరా చేరుకున్నారు. అక్కడ వారికి ప్రియాంక, కేరళ పీసీసీ సన్నీ జోసఫ్ సహా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. సోనియా, రాహుల్ వెంట ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఏఐసీసీ నేతలు ఉన్న హోటల్‌లో సమావేశం జరిగింది. కాగా, ప్రియాంక వారం రోజులుగా తన సొంత నియోజకవర్గంలోనే ఉన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టారు. పార్టీ శాఖలోని అంతర్గత విభేదాల పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెజ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ఎం విజయన్, ఆయన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడం... ఆర్థిక ఇబ్బందులతో పార్టీ నేతలు తల్లడిల్లిపోతుండగా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు ఆమె యత్నిస్తున్నారు. అయితే ఇచ్చిన హామీల అమలులో పార్టీ నాయకత్వం విఫలమైందని, విజయన్ కోడలు ఆరోపించారు. తమ కుటుంబం అప్పుల్లో కూరుకున్నదంటూ మదనపడిన ఆమె ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించారు. గత పదేళ్లలో పార్టీ సంబంధిత సమస్యలతో వయనాడ్‌లోని ఐదుగురు నాయకులు/కార్యకర్తలు ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదికలు వెలువడ్డాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర రక్షణ శాఖ మాజీ మంత్రి ఏకే ఆంటోని కూడా పార్టీపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఏఐసీసీ అగ్ర నాయకుల కేరళ పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకుంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల అధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి సంఘాలతో పాటు వైసీపీ నేతలు... వైద్య విద్య ప్రైవేటీకరణ వద్దు, ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు అంటూ ప్ల కార్డులతో వైద్య కళాశాలలకు ప్రదర్శనగా బయలుదేరారు. పార్వతీపురం, పెనుగొండ, మార్కాపురం, సత్తెనపల్లి, ఏలూరు, బాపట్ల, మచిలీపట్నం, మదనపల్లి తదితర ప్రాంతాల్లోని వైద్య కళాశాలల వద్ద నిరసనలు కొనసాగాయి. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ జీవోను రద్దు చేయాలని నినదించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) మోడల్ ద్వారా లక్షన్నర కోట్ల విలువ చేసే కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు సీఎం చంద్రబాబు ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. 17 కొత్త వైద్య కళాశాలల వద్దకు వెళ్లి కళాశాలల నిర్మాణాల పరిస్థితిని ప్రజలకు వివరించారు. ఏ కళాశాల ఏయే స్థితిలో ఉందో వైసీపీ కార్యకర్తలు నేరుగా ఆయా భవనాల వద్దకు వెళ్లి వీడియోలు, ఫొటోల ద్వారా వివరించారు. దీంతో చాలా చోట్ల వారిని పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు చేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పార్టీ నేతలను హౌస్ అరెస్టులు చేశారు. కొందరిపై కేసులు పెట్టారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం వైద్య కళాశాల వద్దకు కృష్ణాజిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహన్‌రావు, కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేశ్‌బాబు, మచిలీపట్నం ఇంఛార్జ్ పేర్ని కిట్టు, పెనమలూరు పార్టీ ఇంఛార్జ్ దేవభక్తుని చక్రవర్తి, పెడన ఇంఛార్జ్ ఉప్పాల రాము, యువజన, విద్యార్థి సంఘాల నేతలు నిరసన ప్రదర్శనగా వెళ్లారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి వైద్యకళాల వద్ద నిరసనలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వైద్య కళాశాల వద్ద మాజీ ఎంపీ వంగా గీత తదితరులు హాజరయ్యారు. పల్నాడు జిల్లా పరిధిలో నిరసన కార్యక్రమానికి వెళుతున్న మాజీ మంత్రి విడదల రజనిని, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు.

చలో వైద్య కళాశాల విజయవంతం: విడదల రజని

ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు నిర్వహించిన చలో వైద్య కళాశల కార్యక్రమం విజయవంతమైందని మాజీ మంత్రి విడదల రజని స్పష్టం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తూ ఇచ్చిన జీవోను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే దిగొచ్చే వరకు వైసీపీ అధ్వర్యంలో పోరాటాలు చేస్తామని రజని హెచ్చరించారు. పోలీసులను ప్రయోగించి నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూసినా పార్టీ శ్రేణులు, విద్యార్థులు, యువత, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారని వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ.8,500 కోట్ల వ్యయంతో వైఎస్ జగన్ 17 ప్రభుత్వ వైద్యకళాశాలల నిర్మాణం చేపట్టి, ఐదు వైద్య కళాశాలలను పూర్తి చేశారని, వాటిల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఎన్టీఆర్ కాలికి స్వల్ప గాయం

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రముఖ నటుడు ఎన్టీఆర్ గాయపడ్డారు. హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్న ఓ యాడ్ షూటింగ్‌లో ఆయన కాలికి స్వల్ప గాయమైంది. యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్న సమయంలో కిందపడిపోవడంతో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే వ్యక్తిగత సిబ్బంది సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ టీమ్ ప్రకటన విడుదల చేసింది. వైద్యుల సలహా మేరకు పూర్తిగా కోలుకోవడానికి ఎన్టీఆర్ రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోనున్నారని తెలిపింది. ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు తెలిపింది. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.

ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ మృతి

న్యూఢిల్లీ: 'యా అలీ' పాటతో దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన అసోం గాయకుడు జుబీన్ గార్గ్ శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఆయన సింగపూర్‌లో ఫ్రీక్ స్కూబా డైవింగ్ చేస్తూ ప్రమాదవశాత్తూ మరణించారు. ఆయన వయసు 52 సంవత్సరాలు. 90వ దశకంలో అసోంలో ప్రఖ్యాతిగాంచిన జుబీన్... 2006లో తన పాట 'యా అలీ' విజయంతో జాతీయస్థాయిలో పేరుపొందారు. జుబీన్ మరణవార్త అసోంలో అన్ని వర్గాల వారినీ కలవరపాటుకు గురిచేసింది. జుబీన్ మృతిపై రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అభిమానులు శోకతప్త హృదయాలతో స్పందించారు.

వరవరరావు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ప్రముఖ కవి, హక్కుల కార్యకర్త పి.వరవరరావుకు బీమా కోరేగావ్ కేసులో లభించిన బెయిల్‌కు సంబంధించిన షరతులను సవరించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. విచారణ చేపట్టేందుకు తిరస్కరించింది. గ్రేటర్ ముంబైను వీడాలంటే ట్రయిల్ కోర్టు ముందస్తు అనుమతి తప్పనిసరి అన్న షరతును సవరించాలని వరవరరావు అభ్యర్థించారు. అయితే జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యవహారంలో పూర్తి విముఖత వ్యక్తం చేస్తూ, ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. 'ఆయన ఆరోగ్య సంరక్షణను ప్రభుత్వం చూసుకుంటుంది. లేదంటే అదే కోర్టుకు వెళ్లండి. మేము పట్టించుకోం' అని ధర్మాసనం పేర్కొంది. వరవరరావు తరపున సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ కోర్టుకు హాజరయ్యారు. నాలుగేళ్లుగా బెయిల్‌పై ఉన్నాగానీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని, గతంలో వరవరరావు బాగోగులను ఆయన భార్య చూసుకునేవారని, ఇప్పుడు ఆమె హైదరాబాద్‌కు వెళ్లిపోయారని న్యాయవాది తెలిపారు. వరవరరావును చూసుకునేందుకు ఎవరూ లేరని, ఈ కేసు విచారణ ఇప్పట్లో పూర్తి అయ్యే పరిస్థితి లేదన్నారు. సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 'ఆయనకు 82 ఏళ్లు. రెండున్నరేళ్లు కస్టడీలో ఉన్నారు. చార్జిషీటు దాఖలైనప్పటికీ అభియోగాల నమోదు వరకు పరిస్తితి వెళ్లలేదు. ఆరోగ్య పరిస్థితి ఆధారంగానే బెయిల్ లభించింది. ట్రయిల్ కోర్టు ముందస్తు అనుమతి లేకుండా ముంబై దాటేందుకు వీల్లేదు' అని స్పష్టంచేసింది. లభించిన స్వేచ్ఛను దుర్వినియోగించవద్దని, నచ్చిన వైద్యం పొందవచ్చని, ఎన్ఐఆర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోర్టు సూచించింది.

శాంతి చర్చలు కోరుకుంటున్నాం

- సాయుధ పోరాట విరమణ నిజం కాదు
- ఆ ప్రకటన అభయ్ వ్యక్తిగతం
- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్

న్యూఢిల్లీ: మావోయిస్టులు మరోసారి సంచలన ప్రకటన చేశారు. కొద్దిరోజుల క్రితం వెలు వడిన సాయుధ పోరాట విరమణ ప్రకటన... అభయ్ వ్యక్తిగతంగా పేర్కొంది. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఇచ్చిన ప్రకటనతో తమకు సంబంధం లేదంటూ మావోయిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి జగన్ స్పష్టం చేశారు. ఈ మేరకు తాజాగా లేఖ విడుదలైంది. 'శాంతి చర్చలు జరగాలని ఈ ఏడాది మార్చి నుంచి ప్రతిపాదనలు చేస్తున్నాం. ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతియుత వాతావరణంలో చర్చలు జరగాలని డిమాండ్ చేస్తున్నాం' అని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు అనారోగ్య కారణాలతో లొంగిపోతున్నారు. శాంతి చర్చలపై అభిప్రాయాలు తెలపాలని మెయిల్ అడ్రస్ ఇవ్వడం అర్థరహితం. ఇలాంటి ప్రకటనలు చేసే వారు పార్టీ అనుమతి తీసుకుని చేస్తే బాగుండేది. ఆయుధాలు వదిలి పెడదామని ఏకపక్షంగా అభయ్ చేసిన ప్రకటన పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉంది. పార్టీలో ఎలాంటి చర్చలు జరపకుండా సాయుధ పోరాట విరమణ ప్రకటన చేయడం తీవ్రమైన చర్యగా పేర్కొన్నారు. కాగా, మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఆగస్టు 15న రాసినట్లుగా ఉన్న లేఖ ఆలస్యంగా వెలుగు చూసినట్లు మంగళవారం అర్ధరాత్రి జాతీయ మీడియా, సోషల్ మీడియాలో కథనాలు ప్రసారమైన సంగతి తెలిసిందే. హిందీలో విడుదలైన ఈ లేఖలో తమ పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో అమరుడు కాకముందు నుంచే శాంతి చర్చల ప్రస్తావనను ప్రభుత్వం ముందుకు తెచ్చినట్లు అభయ్ వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా, దేశంలో మారుతున్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, హోంమంత్రి అమిత్‌షా మొదలు ప్రధాని నరేంద్ర మోదీ వరకు అనేకమంది ఆయుధాలు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలంటూ చేసిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని సాయుధ పోరాటం విరమించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. అయితే ఈ అంశంపై దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ఇతర మావోయిస్టు నేతలతో చర్చించుకుని తుది నిర్ణయానికి వచ్చేందుకు కనీసం నెల పాటు ప్రభుత్వం తరఫున కూడా కాల్పుల విరమణ కావాలని కోరారు.

సమాజ రుగ్మత ఎత్తిచూపిన బోయి భీమన్న

డాక్టర్ పూర్ణచందుకు పురస్కారం

విశాలాంధ్ర -విజయవాడ: తన రచనల ద్వారా సమాజ రుగ్మతులను ఎత్తిచూపిన మహాకవి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ బోయి భీమన్న ప్రాతఃస్మరణీయులని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ జి. లక్ష్మీ శ అధ్యక్షతన శుక్రవారం బోయి భీమన్న 114వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ... నేడు మానవ హక్కులు, దళిత హక్కుల గురించి మాట్లాడుతున్నామని... అయితే అసమానతలు తీవ్రంగా ఉన్న రోజుల్లోనే వీటి గురించి బోయి భీమన్న ప్రస్తావించడం గొప్ప విషయం అని అన్నారు. "తెలుగే ప్రాచీనం, తెలుగు కోసం వంటి పరిశోధన గ్రంథాలతో పాటు సాహిత్య, వైజ్ఞానిక రచనలు 150 కి పైగా చేసిన డాక్టర్ జీవీ పూర్ణచందుకు బోయ భీమన్న పురస్కారం ఇవ్వడం భీమన్నకు సరైన నివాళి అని చెప్పారు. అనంతరం పూర్ణచందును దుశ్శాలువా తో సత్కరించి, రూ.రెండు లక్షల నగదు పురస్కారం అందజేశారు. ఆయన రచించిన భువన విజయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు చిత్రించిన అఖండ తాండవం చిత్తరువును(పెయింటింగ్) మంత్రి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, డీఆర్ఓ లక్ష్మీ నరసింహం, సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జునరావు, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వి. గంగులయ్య, బోయి భీమన్న సతీమణి హైమావతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు: ప్రముఖ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి గుర్రం జాషువా కవితా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 27న జాషువా 13వ జయంతి సందర్భంగా గుంటూరులో జరిగే సభలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు శుక్రవారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తెలుగు ప్రజలకు తెలకపల్లి రవి సుపరిచితులు. ప్రజాశక్తి దినపత్రిక, ప్రచురణాలయం సంపాదకులుగా పనిచేశారు. సాహిత్య విమర్శకులుగా, నవల, కథ, గేయ రచయితగానే కాకుండా కవితా రచన కూడా చేశారు. సాహిత్య మాసపత్రిక సాహిత్య ప్రస్థానం సంపాదకులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర వ్యాపితంగా వందలాది యువ కవుల కోసం జనకవనం, సాహిత్యశాలలు నిర్వహించారు. సంకలనాలు, అనువాదాలు సహా దాదాపు 80 రచనలు ముద్రితమయ్యాయి. ఆయన విస్తారమైన సాహితీ కృషి చేశారు. తెలుగు భాషలో లబ్ధప్రతిష్టులైన సంపాదకులు అనేకమంది ఉన్నప్పటికీ తెలకపల్లి రవికే ఇన్ని రంగాలలో ప్రవేశమున్నదని ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి ఇటీవల ప్రశంసించారు. ప్రగతిశీల తాత్వికతకు నిబద్ధుడై... ప్రజలు కేంద్రంగా రచనలు చేసే రవికి 2025 గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని ఇవ్వటం సముచితంగా భావిస్తున్నామని పాశం రామారావు తెలిపారు. ఈ సమావేశంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ బాధ్యులు ఎస్.భావనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి'పై కక్షసాధింపు తగదు

సీఎం చంద్రబాబుకు ఎడిటర్స్ గిల్డ్ లేఖ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ అధికారిక తెలుగు వార్తా పత్రిక 'సాక్షి'పై ఇటీవల ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. సాక్షి పత్రికను ఒంటరి చేసి, పోలీసుల చర్యలు తీసుకుంటున్నారని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో మీద ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం ఒక లేఖ రాసింది. రాజ్యాంగం హామీ ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన బాధ్యతగల రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులు నిర్భయంగా పనిచేసే వాతావరణం కల్పించాలని కోరింది. 'గత కొన్ని రోజులుగా తెలుగు పత్రిక సాక్షిపై వేర్వేరు పోలీసు స్టేషన్లలో వరుసగా క్రిమినల్ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సాక్షిని ఒంటరి చేసిన పరిస్థితి కనిపిస్తున్నది. సాధారణంగా జరిగే వార్తాసేకరణకుగాను తమ పత్రికను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ఆ పత్రిక సంపాదకులు ఇటీవల బహిరంగంగానే చెప్పారు. ఇలా వివక్షపూరితంగా వ్యవహరించడం ఆక్షేపణీయం. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం అవసరం. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి. అసంబద్ధ కేసులతో వేధించడాన్ని అడ్డుకోవాలి. పోలీసులు వృత్తి ధర్మానికి కట్టుబడి నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కక్షపూరిత చర్యలు మానుకోవాలి. క్రిమనల్ కేసులను పాత్రికేయులను బెదిరించడం కోసం అస్త్రంగా మార్చుకోవద్దు' అని లేఖలో ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.